# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :42 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 11-04-2025 | పేజీలు:4 వెల: 2.00


## మూడేండ్ల కుమార్తెను చంపి.. తాను ఆత్మహత్య చేసుకున్న తల్లి

పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. మూడేండ్ల కూతురిని చంపిన ఓ మహిళ, అనంతరం తాను ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. జిల్లాలోని జూలపల్లి మండలం కేంద్రానికి చెందిన వేణుగోపాల్ రెడ్డి ఎల్ఐసీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. నాలుగేండ్ల క్రితం కరీంనగర్ జిల్లా వెధిర గ్రామానికి చెందిన సాహితీతో వివాహం జరిగింది. వారికి మూడేండ్ల కూతురు ఉన్నది. ప్రస్తుతం పెద్దపల్లి పట్టణంలోని టీచర్స్ కాలనీలో వేణుగోపాల్ రెడ్డి, లోక సాహితి రెడ్డి దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం వేణుగోపాల్ జగిత్యాలలోని తమ సమీప బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. దీంతో రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో సాహితి తన కూతురు రితన్యకు ఉరివేసి చంపేసింది. ఆ తర్వాత తాను కూడా ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. కాగా, సాహితి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అయితే గత కొంతకాలంగా ఆమె మానసిక బాగాలేనట్లు తెలుస్తున్నది.

## ప్రతి గ్రామానికి గోదావరి నీళ్లు అందించే బాధ్యత నాది



జనగామ రూరల్, ఏప్రిల్10: ప్రతి గ్రామానికి గోదావరి నీళ్లు అందించే బాధ్యత తనదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. భవిష్యత్‌లో రెండు పంటలకు సాగునీరు అందుతుందని నమ్మకం వ్యక్తంచేశారు. జనగామ రూరల్ మండలంలోని పెంబర్తి, పెద్దపాడు, గానుగు పహాడ్, వెంకిర్యాల, అడవి కేశవాపూర్, ఎర్ర గొల్ల పహాడ్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ యాసంగికి బొమ్మకూరు నుంచి కుడి కాలువ ద్వారా నీళ్లు అందిచడంలేదనీ పెంబర్తి రైతులు తన దృష్టికి తీసుకవచ్చారన్నారు. కొంతవరకు ప్రయత్నం చేసినప్పటికీ నీరు అందలేదని చెప్పారు. దీంతో కొన్ని పంటలు ఎండిపోయాయని చెప్పారు. దేవాదుల మూడో దశ మోటార్లు మొదలయ్యాయని, మొదటి దశలో 350 క్యూసెక్కులు, రెండో దశలో 550 క్యూసెక్కులు, మూడో దశలో 1800 క్యూసెక్కులతో నీరు వస్తుందన్నారు. ప్రస్తుతం ఒకటో దశ ప్రారంభమైందని, రెండోది నెల రోజుల్లో, మూడోది మరో రెండు నెలల్లో ప్రారంభమవుతాయని తెలిపారు. తద్వారా రెండు పంటలకు నీరు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవేళ రానట్లయితే అధికారులతో తాను మాట్లాడుతానని వెల్లడించారు. రైతులకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి రైతు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారం చూపుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనగామ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ గాడిపల్లి ప్రేమ లతారెడ్డి, పిఏసిఎస్ చైర్మన్లు చిర్ర శ్రీనివాస్ రెడ్డి, నిమ్మతి మహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బైరగోని యాదగిరి గౌడ్, రైతుబంధు సమితి మాజీ కోఆర్డినేటర్ బురెడ్డి ప్రమోద్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల శ్రీనివాస్, రేఖ, బోళ్ల సంపత్ యాదవ్, ముస్తాల దయాకర్, యాకూబ్ పాషా, శ్రీనివాస్, శంకర్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

## ఇది నా బ్రాండ్.. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు!







రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా స్కూల్ ఈజ్ మై బ్రాండ్ అన్నారు. కొందరు తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. 2 రూపాయలకే కిలో బియ్యం దివంతగ మాజీ సీఎం ఎన్టీఆర్ బ్రాండ్ అయితే తన బ్రాండ్ యంగ్ ఇండియా స్కూల్ అన్నారు. ఈ స్కూల్లలో చేరే వారందరికీ 100 శాతం ఉద్యోగాలు ఇస్తామన్నారు. పోలీసుల పిల్లల చదువుల కోసం తమ ప్రభుత్వం గొప్ప ఆలోచన చేసిందన్నారు. అలాగే తెలంగాణలోనూ త్వరలోనే నర్సరీ ప్లే స్కూల్ అమల్లోకి తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు.

కొందరే చరిత్రలో గుర్తుండిపోయారు..

ఈ మేరకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రతీ పోలీస్ సిబ్బందికి ఇది అత్యంత ముఖ్యమైనది చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలోనే పోలీస్ స్కూల్ అంశాన్ని పొందుపరిచామని గుర్తు చేశారు. ఆనాడు పండిట్ జవహర్ నెహ్రూ సారథ్యంలో దేశంలో యూనివర్సిటీల పునాదులు పడ్డాయి. నెహ్రూ దార్శనికతతోనే మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి చేరింది. దేశ చరిత్రలో ఎంతో మంది ప్రధానులు, ముఖ్యమంత్రులు అయ్యారు. కానీ అందులో కొద్ది మంది మాత్రమే చరిత్రలో గుర్తుండిపోయారు. ఆ కొద్దిమంది తీసుకున్న నిర్ణయాలు చరిత్రను మలుపు తిప్పాయి. ముఖ్యమంత్రుల్లో ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉందని చెప్పుకుంటున్నారు. రూ.2 కిలో బియ్యంతో ఎన్టీఆర్ ప్రతీ పేదవాడి మనసులో స్థానం సంపాదించుకున్నారు. హైదరాబాద్ లో ఐటీని అభివృద్ధి చేసి చంద్రబాబు ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారు. రైతు బాంధవుడిగా ప్రజలు వైఎస్ ను గుర్తుంచుకుంటారని అన్నారు. అలాగే ఇవాళ నా క్రియేట్ చేసిన నా బ్రాండ్ 'యంగ్ ఇండియా' మహాత్ముడి స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్ ను తెలంగాణలో క్రియేట్ చేసుకున్నాం. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది. అందుకే ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అనేది మా బ్రాండ్. నిరుద్యోగుల్లో సాంకేతిక నైపుణ్యంలో శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకున్నాం. ఆనంద్ మహేంద్రను యూనివర్సిటీకి చైర్ పర్సన్ గా నియమించుకున్నాం. ఇవాళ యూనివర్సిటీలో చేరిన ప్రతీ విద్యార్థికి ఉద్యోగ భద్రత ఉంది. దేశంలోనే ది బెస్ట్ యూనివర్సిటీగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీని ఏర్పాటు చేసుకోబోతున్నామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. ప్రాథమిక స్థాయిలోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతుతోందన్నారు. ఒకటో తరగతి నుంచి ఉన్న ప్రభుత్వ స్కూల్స్ విధానంలో మార్పులు తీసుకొచ్చి, ప్రీ-స్కూల్ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సైనిక్ స్కూల్ కు ధీటుగా పోలీస్ స్కూల్ ను తీర్చిదిద్దాలి. ఇందుకు కావాల్సిన నిధులు ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. పోలీస్ స్కూల్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత. సామాజిక బాధ్యతగా ప్రైవేటు కంపెనీలు పోలీస్ స్కూల్ కు ఆర్థిక సాయం అందించాలి. పోలీస్ స్కూల్ కోసం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ క్రియేట్ చేసుకోవాలి. ఇందుకు అవసరమైన అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.

## తహవూర్ రాణా కేసు.. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నరేందర్ మాన్‌ను నియమించిన హోంశాఖ

ముంబై: ముంబై ఉగ్రదాడి కుట్రదారుల్లో ఒకడైన తహవూర్ రాణా ను అమెరికా ప్రభుత్వం భారత్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన్ని అధికారులు భారత్‌కు తరలిస్తున్నారు. ఇప్పటికే ప్రత్యేక విమానం అమెరికాలో బయల్దేరింది. ఇవాళ ఢిల్లీలో ల్యాండ్ కానున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును వాదించేందుకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నరేందర్ మాన్‌ను నియమిస్తూ కేంద్ర హోం శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడు సంవత్సరాల కాలానికి లేకపోతే ట్రయల్ పూర్తయ్యేవరకు దిల్లీలోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానాలు, అప్పిలేట్ కోర్టుల్లో జాతీయ దర్యాప్తు సంస్థ తరఫున ఆయన వాదనలు వినిపించనున్నారు. నిఘా అధికారులు, దర్యాప్తు అధికారులతో కూడిన ప్రత్యేక బృందం తహవూర్ రాణాను తీసుకుని ప్రత్యేక విమానంలో అమెరికా నుంచి బయల్దేరింది. బుధవారం ఉదయం 7.10 (భారతీయ కాలమానం) గంటలకు బయల్దేరిన విమానం గురువారం మధ్యాహ్నానికి ఢిల్లీ చేరుకుంటుందని వారు చెప్పారు. రాణా ఢిల్లీలో దిగిన వెంటనే ఎన్ఐఏ అతడిని అధికారికంగా అరెస్టు చేసి తీహార్ జైలుకు తరలిస్తుంది. రాణా తరలింపు దృష్ట్యా తీహార్ జైలు వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. 16 ఏళ్ల క్రితం అంటే 2008 నవంబర్ 26న పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా ముఠాకు చెందిన 10 మంది ఉగ్రవాదులు ముంబైలో మారణహోమానికి పాల్పడ్డారు. కొబాలా సముద్ర తీరం వెంబడి దక్షిణ ముంబైలోకి ప్రవేశించిన ఈ ముఠా నగరంలో మారణహోమాన్ని సృష్టించారు.



ఛత్రపతి శివాజీ టెర్మినస్, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్, లియోపోల్డ్ కేఫ్, ముంబై చాబాద్ హౌస్, నారిమన్ హౌస్, కామా హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. 18 మంది భద్రతా సిబ్బంది సహా 166 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఈ దాడులకు అవసరమైన ప్రణాళికలు రూపొందించడంలో రాణా కీలక పాత్ర పోషించాడు. దీంతో అతడిపై కేసులు నమోదయ్యాయి. ఇక దాడి జరిగిన ఏడాది తర్వాత అంటే 2009లో షికాగోలో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులు రాణాను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో తహవూర్ రాణా ప్రధాన సూత్రదాడిగా తేలాడు. రాణాకు పాక్‌లోని లష్కరే తోయిబా, ఐఎస్ఐ ఉగ్ర సంస్థలతో లింకు ఉన్నది.

## పవన్ సీరియస్ పొలిటీషియన్ కాదు : కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, భారత రాష్ట్ర సమితి నాయకురాలు, కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత సందర్భం వచ్చినప్పుడల్లా.. జనసేన అధినేత, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై విమర్శల బాణాలు సంధిస్తూనే ఉంటారు. వీరి మధ్య గతంలోనూ మాటల యుద్ధం నడిచింది. రాష్ట్ర విభజన సమయంలో కవిత స్వయంగా పవన్ కళ్యాణ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయనను ఒక 'హాస్యనటుడు' అని, 'రాజకీయాల్లో బ్రహ్మానందం' అని కూడా అభివర్ణించారు. ఆనాటి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన దాదాపు ఒక దశాబ్దం తర్వాత కూడా కవిత తన అభిప్రాయాన్ని మార్చుకున్నట్లు కనిపించడం లేదు. తాజాగా ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న కవిత మరోసారి పవన్ కళ్యాణ్‌పై విమర్శలు గుప్పించారు. పవన్ కళ్యాణ్ ప్రచారం చేస్తున్న "సనాతన" ధర్మం గురించి వ్యాఖ్యానించమని ఇంటర్వ్యూయర్ అడిగినప్పుడు ఆమె తీవ్రంగా స్పందించారు. "నేను ఆయన్ని సీరియస్‌గా తీసుకోలేను. ఆయన ఒకప్పుడు స్వయం ప్రకటిత చే గువేరా ఆదర్శవాదిగా ఉండేవారు. ఇప్పుడు ఒక తీవ్ర మితవాద రాజకీయ నాయకుడిగా మారిపోయారు. పవన్ కళ్యాణ్ లాగా ప్రతిరోజూ తన మాటలను తానే ఖండించుకునే రాజకీయ నాయకుడిని నేను ఎప్పుడూ చూడలేదు. దురదృష్టవశాత్తూ, ఆయన పొరుగు రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. నాకు ఆయనపై ఏమాత్రం గౌరవం లేదు" అని కవిత స్పష్టం చేశారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. పవన్ కళ్యాణ్‌కు కవిత సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు (కేటీఆర్)తో మంచి సంబంధాలు ఉన్నాయి. ఇద్దరూ పలు సందర్భాల్లో తాము సోదరుల బంధాన్ని పంచుకుంటున్నామని బహిరంగంగా చెప్పారు. కేటీఆర్ కళ్యాణ్‌ను తన "సోదరుడు" అని, పవన్ కళ్యాణ్ కూడా కేటీఆర్‌ను అదే విధంగా సంబోధిస్తుంటారు. అయితే కవిత మాత్రం అదే భావనను పంచుకోవడం లేదు. ఆమె ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి గురించి అనేక సందర్భాల్లో తక్కువ చేసి మాట్లాడారు. ఈ ధోరణి కొనసాగుతున్నట్లు కనిపిస్తోంది.

## కాంగ్రెస్ నేతలు బ్రిటీష్ వారి పిల్లలే.. కంగనా రనౌత్ తీవ్ర వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎంపీ, నటి కంగనా రనౌత్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ నేతలు బ్రిటిష్ వారు వదిలి వెళ్లిన "పిల్లలు" అని, వారి పాలనలో దేశం అవినీతికి నిలయంగా మారిందని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా కాంగ్రెస్‌కు పాకిస్తాన్‌తో సంబంధాలు ఉన్నాయని, ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దేశంలో ఉగ్రవాదం వ్యాప్తి చెందిందని కంగనా రనౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆమె ఒక సభలో మాట్లాడుతూ "2014కి ముందు దేశం అవినీతితో అట్టుడికింది. ప్రధాని మోదీ వచ్చాక అన్నీ మారాయి. తన బలమైన నిర్ణయాలతో దేశం పట్ల నిబద్ధతతో ఆయన దేశంపై నెలకొన్న మచ్చను తొలగించారు" అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ బ్రిటిష్ వలసవాద వారసత్వాన్ని పుణికిపుచ్చుకుందని, గతంలో జరిగిన ఉగ్రవాద చర్యలకు ఆ పార్టీ కూడా బాధ్యత వహించాలని ఆమె ఆరోపించారు. "కాంగ్రెస్‌కు పాకిస్తాన్‌తో సంబంధాలు ఉన్నాయి. ఆ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో దేశంలో అశాంతి, భయానక వాతావరణం ఉండేది" అని కంగనా రనౌత్ పేర్కొన్నారు. అంతేకాకుండా అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ఎంతో కష్టంతో పాలన సాగిస్తుంటే, కాంగ్రెస్ నేతలు పార్లమెంటుపై దాడికి కుట్ర చేశారని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా కంగనా రనౌత్ తప్పుబట్టారు. మహిళలకు నెలకు రూ. 8,000, ఏడాదికి రూ. 50,000 ఇస్తామని కాంగ్రెస్ నేతలు అబద్ధపు హామీలు ఇచ్చారని ఆమె విమర్శించారు. ఇటీవల పార్లమెంటులో వక్ఫ్ సవరణ బిల్లు ప్రయోజనాలను కేంద్ర మంత్రి అమిత్ షా వివరిస్తుండగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు గొడవ చేసి సభా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగించారని కంగనా రనౌత్ తెలిపారు. ఈ చట్టం ప్రకారం, అన్ని రాష్ట్రాల వక్ఫ్ బోర్డులు వక్ఫ్ ఆస్తుల రికార్డులను డిజిటలైజ్ చేసి, వాటిని ఒకే పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని ఆమె వివరించారు. అంతేకాకుండా కొత్తగా నియమించబడిన వక్ఫ్ ట్రిబ్యునళ్ల ద్వారా భూ వివాదాలను పరిష్కరించడానికి ఒక కాలపరిమితితో కూడిన కమిటీలను ఏర్పాటు చేసుకునే అధికారం ఈ చట్టం కలిగిస్తుందని ఆమె వెల్లడించారు. మొత్తానికి బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ కాంగ్రెస్ పార్టీపై చేసిన ఈ తీవ్రమైన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

## జగన్‌పై దాడి చేయాలనే కుట్ర.. మా అనుమానం అదే..!

అమరావతి, రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనపై అధికార, ప్రతిపక్షం మధ్య మాటల యుద్ధం నడుస్తూనే ఉంది.. రామగిరి మండలంలో వైఎస్ జగన్ పర్యటనలో భద్రతా వైఫల్యం క్లియర్ గా కనిపించిందని వ్యాఖ్యానించారు మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్.. హెలికాప్టర్‌ను ఇబ్బందులకు గురిచేసి.. మార్గమధ్యలో జగన్‌పై భౌతిక దాడి చేయాలనే కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలున్నాయంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.. దేశంలో అత్యధిక ప్రజాదరణ కలిగిన నేత.. ఇంటెలిజెన్స్ సంస్థల రిపోర్టుల ప్రకారం అత్యధిక థ్రెట్ ఉన్న నేత కూడా జగనే అన్నారు.. హోంమంత్రి అనిత మాత్రం.. జగన్ పర్యటనలో 1100 మంది పోలీసులను బందోబస్తులో పెట్టామని చెబుతున్నారని.. 1100 పోలీసుల్లో ఎక్కువ మందిని పరిటాల సునీత ఇంటి దగ్గరే పెట్టారా? అని ఆయన ప్రశ్నించారు..మంత్రి నారా లోకేష్ కు జెడ్ ప్లస్ రక్షణ కల్పిస్తూ.. వైఎస్ జగన్ కు మాత్రం రక్షణ తగ్గిస్తున్నారని మండిపడ్డారు గోరంట్ల మాధవ్.. రామగిరి ఎస్సై సుధాకర్ యాదవ్.. వైసీపీ కార్యకర్తలపై దాడులు చేసినా పెట్టించుకోక పోవటం వల్లే హత్యల వరకు పరిస్థితి వెళ్లిందని విమర్శించారు.. రామగిరి ఎస్సై వ్యవహరించిన తీరుతో పోలీస్ వ్యవస్థ సిగ్గుపడాలన్నారు.. ఆయన బయటకు వచ్చి సోషల్ మీడియాలో పోస్ట్ లు పెట్టడం హాస్యాస్పదమన్నారు గోరంట్ల మాధవ్.. ఇంటెలిజెన్స్ సంస్థల రిపోర్టుల ప్రకారం అత్యధిక థ్రెట్ ఉన్న నేత కూడా జగనే.. ఆయనకు మూడంచెల భద్రత అవసరం అన్నారు.. రాష్ట్రంలో జగన్ ఏ ప్రాంతానికి వెళ్ళినా వేలాదిగా అభిమానులు వస్తున్నారు.. ప్రజలను అదుపు చేయాల్సిన బాధ్యత పోలీసులదే.. రామగిరి జగన్ పర్యటనలో భద్రతా వైఫల్యం క్లియర్ గా కనిపించిందని వ్యాఖ్యానించారు..రామగిరిలో ముత్యాలు అనే వైసీపీ కార్యకర్త ఇంటిపై రాళ్లదాడి జరిగిన సమయంలో నేనే పోలీసులకు సమాచారం ఇచ్చా.. ఘటన సమయంలో



అక్కడకు వచ్చిన పోలీసులు కింద పడ్డ రాళ్లను తమ వాహనంలో వేసుకుని వెళ్లారు.. రామగిరి ఎస్సై బాధితుల వాహనాల్లో కత్తులు పెట్టి తిరిగి అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు గోరంట్ల మాధవ్.. వైసీపీ కార్యకర్తలపై దాడులు చేసినా పోలీసులు పెట్టించుకోక పోవటం వల్లే హత్యల వరకు పరిస్థితి వెళ్ళిందన్నారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్..

## పేదల జోలికి వస్తే సహించేది లేదు .. ఎమ్మెల్యే తలసాని వార్నింగ్

బేగంపేట, ఏప్రిల్ 10: పేదల జోలికి వస్తే సహించేది లేదని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. సనత్ నగర్‌లోని దాసారంలో సుమారు 300 కుటుంబాలు గత 30 సంవత్సరాల నుంచి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. కాగా బుధవారం కొందరు వ్యక్తులు తమ అనుచరులతో వచ్చి గుడిసెలు ఖాళీ చేయబోతున్నారు. దీంతో ఆందోళనకు గురైన వారంతా గురువారం వెస్ట్ మారేడ్ పల్లిలోని కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎన్నో సంవత్సరాల నుండి తాము ఇక్కడే ఉంటున్నామని, ఇప్పుడు తమను వెళ్లాలంటే ఎక్కడికి వెళ్లిపోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీవాసుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్. ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. పేదల జోలికి రాకుండా, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు



తీసుకోవాలని అధికారులను నియమించారు. ఎలాంటి ఆందోళన చెందకుండా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు.

## పోలీసుల అదుపులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్

హైదరాబాద్: భారాస నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజాభవన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ఆయనపై గతంలో లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. గత కొన్ని నెలలుగా షకీల్ దుబాయ్‌లో ఉంటున్నారు. తల్లి అంత్యక్రియల కోసం గురువారం హైదరాబాద్ చేరుకోగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆయనకు అనుమతించారు.

## సంపాదకీయం

శుక్రవారం 11-04-2025

# వడ్డీలు..పన్నుల్లో హేతుబద్ధత ఉండాలి !

ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధానం కారణంగా కొంత వెసులబాటు కలుగుతోంది. అయితే ఇది మరింతగా ప్రజలరు ఆదుకునేలా ఉండాలి. వడ్డీరేట్లు ప్రజలకు, వ్యాపారులకు, ఉద్యోగులకు అనువుగా ఉండాలి. వారు భరించేవిగా ఉండాలి. పన్నులు కూడా హేతుబద్ధంగా ఉండాలి. విపరీతంగా పన్నులు, వడ్డీలు వసూలు చేస్తే ప్రజలు భరించలేరని గుర్తించాలి. స్వయం ఉపాధి పొందే వారికి,చవువుకునే వారికి ఉపయుక్తంగా ఉండాలి. డబ్బు వినిమయం, వస్తు కొనుగోళ్లకు అవినాభావ సంబంధం ఉంది. డబ్బు మార్కెట్లో చలామణి అవుతూనే వస్తూత్పత్తి అన్నది ప్రజలకు చేరాలి. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా పరపతి విధానం ఉండాలి. అది ఇల్లు కావు, ఇతర పదార్థాలు కావచ్చు. అలాగే పెట్రో ధరలు, గ్యాస్ ధరలు కూడా ప్రజల కొనుగోలు శక్తికి మించి ఉండరాదు. ఇవి వస్తువుల ధరలు కూడా నియంత్రిస్తుంటాయి. వీటి ధరల ఆధారంగానే మార్కెట్లో వస్తువుల ధరలు పెరుగుతాయి. ఇవి బ్యాలెన్స్ చేయడం అన్నది ప్రభుత్వం నడిపిస్తున్న వారికి అవసరం. అదేపనిగా ఉచిత పథకాల కారణంగా సమాజంలో పనిచేసే వారు తగ్గిపోతున్నారు. తినికూర్చునే వారు పెరుగు తున్నారు. దీంతో వస్తూత్పత్తి కూడా తగ్గుతుంది. ఇది కూడా గమననించాల్సి ఉంది.ఇకపోతే ధర పెరిగినంత మాత్రాన పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించ లేము. కనుక వాటికోసం మనం వెచ్చించే మొత్తం పెరిగింది. ఐతే కార్మికుల, ఉద్యోగుల వేతనాలు మొత్తం మాత్రం పెరగడంలేదు. దీంతో మనం ఇతర వస్తువుల వినియోగాన్ని తగ్గించివేస్తున్నాం. ఇతర సరుకుల వినియోగం ఎప్పుడైతే తగ్గిందో, ఆ మేరకు ఆయా రంగాలలో మాంద్యం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ప్రభుత్వం పూనుకోవాలి. కాని అలా జరగడం లేదు. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగి నప్పుడల్లా వాటిమీద వసూలు చేసే పన్నుల మొత్తం కూడా పెరుగుతోంది. ప్రస్తుత సంక్షోభాన్ని నివారించాలంటే ప్రజల కొనుగోలుశక్తిని పెంచే మార్గాలు అన్వేషించాలి. ఉపాధికల్పన మార్గాలను అన్వేషించాలి. కనీసం పెట్రో ఉత్పత్తుల మీద పన్నులను పెంచడం తగ్గిస్తే ప్రజల కొనుగోలుశక్తి పెరుగుతుంది. అప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకోగలరు. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెట్రో ధరల పెరుగుదల వలన అదనపు ఆదాయం సమకూరుతోంది. ఆవిధంగా వచ్చిన అదనపు ఆదాయాన్ని ఉపాధి కల్పన వంటి రంగాలకు ఖర్చు చేయడం బదులు, కార్పొరేట్లకు మరిన్ని రాయితీల్విడానికో, వారి బకాయిలను మాఫీ చేయడానికో వినియోగిస్తోంది. అలాగే మరిన్ని ఉచిత పథకాలకు వెచ్చిస్తున్నారు. వాస్తవానికి మన దేశంలో పెట్రోలు ధరలో 45.5 శాతం, డీజిల్ ధరలో 39.8 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులకే పోతుంది. పన్ను రూపంలో వసూలు చేసేదానిలో కేంద్రం రాష్ట్రాలతో భాగం పంచుకోవాలి. అందుచేత మోడీ ప్రభుత్వం నేరుగా పన్ను రూపంలో కాకుండా స్పెషల్ డ్యూటీ, రోడ్ సెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ వంటి పేర్లతో వసూలు చేస్తోంది. తరచూ ఆర్థిక మాంద్యం ఏర్పడడం వల్ల సరుకుల వినిమయం తగ్గిపోతుంది. అదే విధంగా ద్రవ్యోల్బణం పెరుగుతూ వుంటుంది. మన రూపాయి విలువ పడిపోయినా, సరుకుల ధరలు పెరిగినా అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగం 8 శాతం దాటింది. వీటికి తోడు మన దేశ వార్షిక జిడిపి వృద్ధి రేటు ముందు అంచనా వేసినట్టుగా ఉండడం లేదని తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ట్రంప్ విధానాలు, పాలస్తీనా,ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద ప్రభావం చూపనున్నాయని అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి ఆర్థి దుస్థితికి తాజా ఉదాహరణాలు. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. ఐతే మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారుల మీదకు నెట్టివేస్తున్నారు. ఇకపోతే పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడం వలన దాని ప్రభావం రవాణా రంగం మీద పడుతుంది. దాని కారణంగా ఇతర సరుకుల ధరలు కూడా పెరుగుతాయి. ఇవన్నీ కలిసి ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దీని పర్యవసానంగా శ్రామిక ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోతుంది. దానివలన సరుకుల వినియోగం తగ్గిపోతుంది. మార్కెట్ లోని సరుకులు చెల్లుబాటు కావు. అందువలన ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది. ఇకపోతే మనదగ్గర పంటలు బాగానే పండుతున్నాయి. మిర్చి, పప్పు ధాన్యాలు విపరీతంగా పండుతున్నాయి. వరి లెక్కకు మించి పండిస్తున్నారు. అయితే ఈ ధరలు ప్రజలకు చేరడం లేదు. తాజాగా ఆక్వా రైతులు ట్రంప్ దెబ్బకు విలవిల్లాడుతున్నారు. చికెన్, మటన్ ధరలు విపరీతంగా పెరుగుతున్నా ఆక్వా సామాన్యులకు అందుబాటు లోకి లేదు. దానిని ప్రజల చెంతకు తీసుకుని వెళ్లాల్సి ఉంది. ప్రజలకు మనదేశంలో లభిస్తున్న ఆహార ఉత్పత్తులు సరసమైన ధరలకు చేరాలి. ప్రధానంగా రొయ్యలను ఇంటింటికీ చేరుకునేలా చేయాలి. 140 కోట్లు జనాభా ఉన్న మనదేశంలో మాంసాహారులు కూడా ఎక్కువే. అమెరికా సుంకాలకు భయపడి కూర్చోకుండా ఆక్వాను ప్రజలకు అందించేలా ప్రణాళికలు చేయాలి. ఇకపోతే ట్రంపం సుంకాలను విమర్శిస్తున్న మనం ..మనవద్ద మోడీ సుంకాలను పట్టించుకోవడం లేదు. దేశం ఆర్థికంగా నిలదొక్కుకుని ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలంటే జిఎస్టీ వడ్డింపులు భారీగా తగ్గాలి. ఉచిత పథకాలను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టాలి. తాయిలాలను పక్కన పెట్టాలి. కిలో రూపాయికే బియ్యం పథకానికి పాతరేయాలి. వడ్డీరేట్లు మరింతగా తగ్గాలి. విద్యార్థులు తీసుకునే విద్యారుణాలపై వడ్డీ నామమాత్రంగా ఉండేలా చూడాలి. ఇలా ఆలోచన చేసినప్పుడే, ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుంది. సంపాదించింది తిండికి కూడా సరిపోకపోతే దాని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతుందని పాలకులు, వారికి సలహాలు ఇస్తున్న మేధావులు గుర్తించాలి.

# సవాళ్ళు.. ప్రతి సవాళ్ళతో మళ్లీ వేడెక్కిన 'స్టేషన్ ఘన్‌పూర్'

హైదరాబాద్,కడియం కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచీ.. తన చిరకాల రాజకీయ ప్రత్యర్థి అయిన ఆయనపై రాజయ్య కాలు దువ్వుతూ వస్తున్నారు. తాజాగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టుల వ్యాఖ్యానంతో 'స్టేషన్'లో సైతం ఉప ఎన్నికలొస్తాయనే ప్రచారం సాగుతున్నది. ఇది సహజంగానే బీఆర్‌ఎస్‌లో ముఖ్యంగా రాజయ్యలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. రాష్ట్ర రాజకీయాల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నిరంతరం వ్యక్తిగత, రాజకీయ సంచలనాలకు నిలయంగా ఉంటున్నది. తాజాగా మరోసారి ఈ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల నాయకుల మధ్య సవాళ్ళు, ప్రతి సవాళ్ళతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఇక్కడ కడియం శ్రీహరి, తాటికొండ రాజయ్య మధ్య రాజకీయ యుద్ధం నిత్యకృత్యంగా మారింది. భిన్న రాజకీయ పార్టీల ప్రతినిధులుగా ప్రారంభమైన వీరిద్దరి వైరం నేటికీ కొనసాగుతున్నది. ఇద్దరు వేర్వేరు పార్టీల్లో ఉంటే ప్రత్యక్ష పోరు, ఒకే పార్టీలో ఉంటే ప్రచ్ఛన్న పోరు అన్నట్టు పరిస్థితి తయారైంది. ప్రస్తుతం ఈ ఇద్దరూ రాజకీయ వైరి శిబిరాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రోజువారీగా ఈ ఇద్దరి నాయకుల మధ్య సవాళ్ళు, ప్రతిసవాళ్ళ కొనసాగుతున్నాయి. మధ్యలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య భూమిక నిర్వహిస్తూ ఈ నాటకాన్ని మరింత రక్తి కట్టిస్తున్నారు. ఈ ముగ్గురు నాయకుల మధ్య రోజువారీగా సాగుతున్న సవాళ్ళు, ప్రతి సవాళ్ళతో స్టేషన్ ఘన్‌పూర్, జనగామల్లో నిత్యం పొలిటికల్ హీట్ సెగలు పుట్టిస్తున్నది.

గత ఎన్నికలనాటికి కూడా ముగ్గురూ బీఆర్‌ఎస్ పార్టీ

కడియం శ్రీహరి, తాటికొండ రాజయ్య, పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయమంతా ఒకే పార్టీలో కొనసాగారు. ముగ్గురూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులుగా ఉన్నారు. కడియం శ్రీహరి వరంగల్ ఎంపీగా, ఎమ్మెల్సీగా, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. తాటికొండ రాజయ్య స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్సీగా, రైతు బంధు కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల వరకు ఒకే పార్టీ బీఆర్‌ఎస్‌లో కొనసాగారు. స్టేషన్ ఘన్‌పూర్ సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న తాటికొండ రాజయ్య స్థానంలో ఎమ్మెల్సీగా ఉన్న కడియం శ్రీహరి ఎమ్మెల్యే టికెట్ దక్కించుకోవడమే కాకుండా.. విజయం సాధించారు. ఆఖరి క్షణం వరకు టికెట్ కోసం అలుపెరుగని పోరుచేసిన రాజయ్య ఆఖరికి అధిష్ఠానం నిర్ణయం ముందు మోకరిల్లి, పోటీ నుంచి తప్పుకొన్నారు. జనగామ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిని తప్పించి ఆ స్థానం పల్లా రాజేశ్వర్ రెడ్డి చేజిక్కించుకున్నారు. ఈ విషయంలో ముత్తిరెడ్డి, పల్లా మధ్య బహిరంగ రచ్చే జరిగింది. బీఆర్‌ఎస్ అధినాయకత్వం అండదండలు ఉన్నందున పల్లా ఎమ్మెల్యే టికెట్ సాధించి బరిలో నిలిచి గెలిచారు.

కడియం కాంగ్రెస్‌లో చేరికతో మారిన సమీకరణాలు

స్టేషన్ నుంచి కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచిన తర్వాత ఆయనకు వ్యతిరేకంగా రాజయ్య వ్యవహరిస్తూ వచ్చారు. బీఆరెస్‌కు రాజీనామా చేశారు. కాంగ్రెస్‌లో చేరేందుకు విఫలయత్నం చేశారు. లోక్ సభ ఎన్నికల నాటికి నియోజకవర్గ రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. కడియం కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. కడియం కుమార్తె డాక్టర్ కావ్య కాంగ్రెస్ నుంచి వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. అప్పటి వరకు కాంగ్రెస్ వైపు చూసిన రాజయ్య మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిపోయారు.



పరస్పర దూషణలు, కబ్జా ఆరోపణలు

కడియం కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచీ.. తన చిరకాల రాజకీయ ప్రత్యర్థి అయిన ఆయనపై రాజయ్య కాలు దువ్వుతూ వస్తున్నారు. తాజాగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టుల వ్యాఖ్యానంతో 'స్టేషన్'లో సైతం ఉప ఎన్నికలొస్తాయనే ప్రచారం సాగుతున్నది. ఇది సహజంగానే బీఆర్‌ఎస్‌లో ముఖ్యంగా రాజయ్యలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. దీనికి తోడు కడియం కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి బీఆర్‌ఎస్ నాయకులందరికీ టార్గెట్‌గా మారారు. అప్పటి నుంచి కడియంపై రాజయ్యతో పాటు పల్లారాజేశ్వర్ రెడ్డి, ఇతర నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. పరస్పరం దూషించుకోవడం పరిపాటిగా మారింది. వారి విమర్శలకు కడియం సైతం అంతే దీటుగా స్పందిస్తుండటంతో రాజకీయ వేడి పుడుతున్నది. ఇటీవల రూ.800 కోట్ల అభివృద్ధి పనులు సీఎం రేవంత్ ప్రారంభించారు. భారీ సభ పెట్టారు. ఈ సందర్భంగా ఉప ఎన్నికలొస్తాయనే చర్చ సాగింది. దీనికి తోడు ముగ్గురు నాయకుల మధ్య అక్రమ సంపాదనల విషయంలో ఆరోపణలు చేసుకోవడం పరిపాటిగా మారింది. కడియం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. తాజాగా పల్లాపై కడియం తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. బొచ్చుకుక్కలాంటోడు, అధికారాన్ని అడ్డంపెట్టుకుని, కేసీఆర్ పేరుచెప్పుకొని కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించుకున్నాడని ఆరోపించారు. దీనికి ప్రతిగా పల్లా స్పందిస్తూ తాను కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్‌కు కాపాలా కుక్కనే అంటూ దీటుగా బదులిచ్చారు. ఈ క్రమంలో పల్లా, తాటికొండ కలిసి కడియం పై తీవ్ర విమర్శలు చేశారు. దేవునూరు పరిసర ప్రాంతంలో 50 ఎకరాల అటవీ భూములను ఇద్దరి పేరుతో కడియం ఆక్రమించారని ఆరోపించారు.

భూ కబ్జా నిరూపిస్తే గులాంగిరి చేస్తా: కడియం

భూ కబ్జా ఆరోపణలపై కడియం తీవ్రంగా ప్రతిస్పందించారు. పల్లా , తాటికొండ ఇద్దరూ దేవనూరుగుట్టలను సందర్శించాలని, తనపై చేసిన కబ్జా ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేశారు. భూ ఆక్రమణ నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వాళ్లకు గులాంగిరీ చేస్తానని ప్రకటించారు. భూ కబ్జా ఆరోపణలు నిరూపించకపోతే ఆ ఇద్దరూ తనకు గులాంగిరీ చేయాలని అంటూ.. ఏ మాత్రం చీమూ, నెత్తురు ఉంటే తన సవాల్‌ను స్వీకరించాలని కడియం డిమాండ్ చేశారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉప ఎన్నికలొస్తే ఎదుర్కోవడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. జిల్లాలో తన కంటే పెద్ద లీడర్ ఎవరూ లేనందునే తనను టార్గెట్ చేస్తున్నారని కడియం విమర్శించారు.

# ఆయన ఫామ్ హౌస్ సీఎం.. ఈయన రెసిడెన్సీ సీఎం!




హైదరాబాద్,సచివాలయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరంలో ఉండి కూడా రాకపోవడం మూలంగా పాలన గడి తప్పిందనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యమంత్రి రాకపోవడంతో ఐఏఎస్ అధికారులు, ఉన్నతాధికారులు పనివేళల్లో కాకుండా తమకు నచ్చిన సమయంలో వచ్చి వెళ్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా తొమ్మిదిన్నర సంవత్సరాల పాటు పని చేసిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సచివాలయానికి వచ్చి సమీక్షలు నిర్వహించింది అతి స్వల్పం. సచివాలయానికి రాకుండా పరిపాలన సాగించిన ముఖ్యమంత్రిగా విపక్షాలు, విశ్లేషకుల విమర్శలకు గురయ్యారు. ఆయన తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సైతం అదే ధోరణి కనిపిస్తున్నదని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెగ్యులర్‌గా సచివాలయానికి వస్తేనే పాలన సజావుగా సాగుతుందని అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసం లేదా బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని పోలీసు కమాండ్ కంట్రోల్ కార్యాలయం, అప్పుడప్పుడు సచివాలయానికి వచ్చి సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో గడీల పాలన నడుస్తున్నదని, ఫామ్ హౌస్‌లో సమీక్షలు చేస్తున్నారంటూ కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గతంలో విమర్శలు చేశారు. నాడు ఫామ్ హౌస్ సమీక్షలైతే.. నేడు రెసిడెన్సీ సమీక్షలు అన్నట్టు పరిస్థితి తయారైందని విశ్లేషకులు అంటున్నారు.తన తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో కేసీఆర్ పదిహేను నుంచి ఇరవై సార్లు మాత్రమే సెక్రటేరియట్ కు వచ్చారు. పాత సచివాలయం కూల్చి నూతన సచివాలయం నిర్మించే సమయంలో పనులు పరిశీలించేందుకు వచ్చిపోయేవారు. ప్రజా తీర్పు ప్రకారం 2023 సంవత్సరం డిసెంబర్ నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తొలి ఆరు నెలల పాటు సందర్శకులు పెద్ద ఎత్తున సచివాలయానికి వచ్చారు. ఆ తరువాత సందర్శకుల సంఖ్య క్రమక్రమంగా తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పౌరులను సచివాలయం లోనికి అనుమతిస్తున్నారు.సచివాలయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరంలో ఉండి కూడా రాకపోవడం మూలంగా పాలన గాడి తప్పిందనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యమంత్రి రాకపోవడంతో ఐఏఎస్ అధికారులు, ఉన్నతాధికారులు పనివేళల్లో కాకుండా తమకు నచ్చిన సమయంలో వచ్చి వెళ్తున్నారు. అయితే కొందరు మంత్రులు నగరంలో ఉన్న సందర్భంలో కచ్చితంగా సచివాలయానికి వస్తున్నారు. ఈ ఏడాది మూడు నెలల కాలంలో రేవంత్ రెడ్డి సచివాలయాన్ని ఐదు సార్లు మాత్రమే సందర్శించి సమీక్షలు నిర్వహించడం గమనార్హం. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏడుసార్లు ఉన్నతాధికారులు, మంత్రులతో సమీక్షలు నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఐదుసార్లు సమీక్షలు నిర్వహించారు.మొత్తంగా ముఖ్యమంత్రి ఈ ఏడాది మూడు నెలల కాలంలో సచివాలయానికి ఆరు సార్లు (రోజులు) వచ్చి సమీక్షలు, సమావేశాలు నిర్వహించి వెళ్లారు. మిగతా రోజుల్లో జిల్లా, ఢిల్లీ పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాలు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యారు. జనవరి 16 నుంచి సింగపూర్, దావోస్‌లలో పెట్టుబడుల కోసం పర్యటించారు. ఫిబ్రవరి 4వ తేదీన కుల గణన, ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశమైంది. మార్చి 12 నుంచి 27 వరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరిగాయి. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో బేగంపేట ప్రగతి భవన్ ముందు మెయిన్ రోడ్డుపై ఉన్న ఇనుప కంచెను బద్ధలు కొట్టిన సందర్భంలో ప్రజలు సంతోషపడ్డారు. కానీ, ఆ తరువాత రేవంత్‌రెడ్డి కూడా సచివాలయానికి రెగ్యులర్‌గా రాకపోవడం చర్చనీయాంశమవుతున్నది.

ముఖ్యమంత్రి 3 నెలల సమీక్షలు, సమావేశాలు..

జనవరి 3 : కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హైదరాబాద్ జలమండలిపై సమీక్ష
జనవరి 3 : సచివాలయంలో రీజినల్ రింగ్ రోడ్డుపై సమీక్ష
జనవరి 4 : సచివాలయంలో నీటి పారుదల శాఖపై సమీక్ష
జనవరి 6 : జూబ్లీహిల్స్ నివాసం నుంచి చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమం (వర్చువల్)
జనవరి 7 : జూబ్లీహిల్స్ నివాసంలో ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లపై సమీక్ష
జనవరి 9 : బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పంచాయత్ రాజ్ పై సమీక్ష
జనవరి 10 : సచివాలయంలో జిల్లా కలెక్టర్ల సదస్సు
జనవరి 11 : జూబ్లీహిల్స్ నివాసంలో ఉస్మానియా ఆసుపత్రిపై సమీక్ష
జనవరి 13 : జూబ్లీహిల్స్ నివాసంలో పరిశ్రమల శాఖపై సమీక్ష
జనవరి 25 : బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రజా పాలన పథకాలపై చర్చ
జనవరి 26 : జూబ్లీహిల్స్ నివాసంలో జాతీయ జెండా ఆవిష్కరణ
జనవరి 28 : సచివాలయంలో దావోస్ పర్యటనపై మీడియా సమావేశం
జనవరి 29 : కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కుల గణనపై సమీక్ష
ఫిబ్రవరి 1 : కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆర్థిక శాఖ పై సమీక్ష
ఫిబ్రవరి 22 : జూబ్లీహిల్స్ నివాసంలో విద్యా కమిషన్ సభ్యులతో సమావేశం
మార్చి 1 : కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఖనిజాభివృద్ధిపై సమావేశం
మార్చి 1 : జూబ్లీహిల్స్ నివాసంలో కార్మిక శాఖపై సమావేశం
మార్చి 6 : సచివాలయంలో మంత్రివర్గ సమావేశం
ఏప్రిల్ 4 : కమాండ్ కంట్రోల్ సెంటర్ లో విద్యా కమిషన్ పై సమావేశం
ఏప్రిల్ 5 : సచివాలయంలో లోకాయక్త, మానవ హక్కుల కమిషన్ సెలెక్షన్ కమిటీ భేటీ

## సముద్ర అలలకు దెబ్బతిన్న బోటు

శ్రీకాకుళం, గత మూడు రోజులు నుండి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీణ ప్రభావం వలన సముద్రంలో అలలు తాకిడికి శ్రీకాకుళం జిల్లా లక్కివలస పంచాయతీ గెద్దలపాడు గ్రామానికి చెందిన శ్రీరంగం వీరాస్వామికి చెందిన ఇంజిన్ బోటు- పూర్తిగా ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న మత్స్యక అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. అల్పపీడనం ప్రభావం వలన బోటు-ను లంగరు వేశారు.

# పోర్ట్ హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలి

విశాఖపట్టణం,విశాఖపట్నం పోర్టు హాస్పటల్ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం యునైటెడ్ ఫోర్త్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పోర్టు చైర్మన్ ఆఫీస్ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు ప్రైవేటీకరణ ఆపాలని, రీటెండర్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోర్టు యాజమాన్యం సొంత నిధులతోనే హాస్పటల్ ను అభివృద్ధి చేయాలన్నారు. మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. అవసరమైన నిపుణులైన డాక్టర్లు సిబ్బందిని ఏర్పాటు చేయాలని, అధునాతన వైద్య పరికరాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. పోర్టు స్టేడియంలో విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ లో బాలుడు చనిపోయిన సంఘటన, యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడమేనని ఆరోపించారు. కనీస భద్రతా ప్రమాణాలు పాటించలేదన్నారు. ప్రభుత్వ ఆస్తులపై అజమాయిషీ ని ప్రైవేట్ వారికి అప్పగిస్తే, ఇదేవిధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని ఆయన గుర్తు చేశారు.కనుక పోర్ట్ ఆస్తులను ప్రైవేటు- వారికి ఇవ్వరాదన్నారు. రీటెండర్ పక్రియ వెనక్కి తీసుకోని ఎడల ఈనెల 21న మరోసారి పోర్ట్ ఎఓబి వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ, కార్యదర్శి బి.జగన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి. రామలింగేశ్వరరావు, విడి ఎల్ బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జె.సత్యనారాయణ బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ బాటలో..నోరు పారేసుకున్న కారుమూరు

ఏలూరు,వైకాపా అధినేత జగన్ పోలీసుల బట్టలూడదీస్తానిన హెచ్చరిస్తే..గతంలో ఆయన మంత్రివర్గంలో మంత్రి అయిన ఓ మంత్రి మరో అడుగు ముందుకు వేశారు. అవతలి వారిని, ఇవతలి వారిని లాక్కచ్చి కొడతానంటూ మాజీమంత్రికారుమూరి నాగేశ్వర రావు హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులపై వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇలా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీ ఇంటికి ఎంత దూరమో.. మా ఇంటికి కూడా అంతే దూరం' అంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చాక గుంటూరుకు ఇటు వైపువాళ్లను లాక్కొచ్చి కొడతామని.. అటు వైపువాళ్లను నరికి పారేస్తాంటూ కారుమూరి పరుస పదజాలంతో మాట్లాడారు. ఏలూరులో జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కారుమూరి ఈ వ్యాఖ్యలు చేశారు. 'మన ప్రభుత్వమే వస్తుందని.. 'గుంటూరు అవతలవారిని నరికేస్తాం... ఇవతలవారిని ఇంటి నుంచి లాక్కొచ్చి కొడతాం' అని వ్యాఖ్యలు చేశారు. నేను పెద్దిరెడ్డి దగ్గరకు వెళ్లాను. కూటమి ప్రభుత్వం ఏం చేసినా కూడా దాన్ని దాటి ప్రజలు మనకు ఓటేస్తారని చెప్పాను. తెలుగుదేశం నాయకులు సైతం మాపై కక్ష పెట్టుకోవద్దు అని అంటున్నారు. అది మాత్రం జరగదు. గుంటూరు ఇవతల వాళ్లను ఇంట్లో నుంచి లాగి కొడతారు. గుంటూరు అవతలి నుంచి నరికిపారేస్తారు. మనింటికి వాళ్ల ఇల్లు ఎంత దూరమో వాళ్లింటికి మనిల్లు అంతే దూరం' అంటూ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. కారుమూరి చేసిన వ్యాఖ్యల వీడియోను టీడీపీ అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. జగన్ అహంకారానికి ప్రజలు బుద్ధి చెప్పినా, వైసీపీ నేతల్లో అధికార మదం ఇంకా దిగలేదని.. వారి నేర ప్రవృతికి ఇదే నిదర్శనమని అన్నారు. గతంలో ఆయన మంత్రిగా ఉన్న సమయంలో రైతుల్ని ఎర్రిపప్పులు అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్పందించిన కారుమూరి ఎర్రిపప్ప అంటే బుజ్జికన్నా అని అర్థంగా చెప్పారు. దాంతో అందరూ ఆయనను ఎర్రిపప్పా అని సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు. కాగా కారుమూరి నాగేశ్వరరావు చేసిన హెచ్చరికలపై టీడీపీ నేతలు మండి పడుతున్నారు. బహిరంగంగా చంపుతామని హెచ్చరిస్తున్న ఆయనపై కేసులు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వైసీపీ నేతలను రెచ్చగొట్టి.. హింస జరిగేలా చేసి..రాష్ట్రంలో పరిస్థితులు దిగజార్చేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయని టీడీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సంచలన విషయాలు..!

హైదరాబాద్, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆరోగ్య సమస్యల్లో డయాబెటిస్ ఒకటి. మధుమేహ బాధితుల సంఖ్య రోజుకు పెరుగుతూ వస్తోంది. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ దీని బారినపడుతున్నారు. మారుతూ జీవనశైలి కారణంగా దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్నారు. దీన్ని నియంత్రించకపోతే భవిష్యత్తులో ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాబోయే సంవత్సరాల్లో భారత్‌లో ఆందోళనకరంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఇండియన్ డయాబెటిస్ ఫెడరేషన్ ఇటీవలి నివేదికలో భయంకరమైన విషయాలు వెలుగు చూశాయి. ప్రస్తుతం భారత్‌లో 89.8 మిలియన్ల (8.94కోట్లు) మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఇది 2050 నాటికి భారత్‌లో డయాబెటిస్ కేసులు 73 శాతం పెరిగి 156 మిలియన్లు (15.6కోట్లు) చేరుకుంటుందని నివేదిక వెల్లడించింది.ఇదిలా ఉండగా.. ప్రపంచవ్యాప్తంగా 20-79 సంవత్సరాల మధ్య వయసు గల 589 మిలియన్ల మంది మధుమేహంతో జీవిస్తున్నారని అంచనా. ప్రపంచ జనాభాలో 11.1 శాతం మంది దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నారు. 2050 నాటికి ఈ సంఖ్య 853 మిలియన్లకు పెరుగుతుందని అంచనా. మధుమేహంతో జీవిస్తున్న నలుగురిలో ఒకరు (158 మిలియన్లు) 65 మంది వ్యక్తులు. 20-79 సంవత్సరాల వయస్సు గల 365 మిలియన్ల మంది గ్లూకోజ్ టాలరెన్స్‌తో జీవిస్తున్నారని అంచనా. 2024లో మధుమేహంతో బాధపడుతున్న వారంతా చికిత్స కోసం ట్రిలియన్ ప్రముఖుడు చేశారు. ఇది ప్రపంచ ఆరోగ్య వ్యయంలో 12 శాతంగా ఉన్నది. ఇదే సంవత్సరంలో వ్యాధి కారణంగా 3.4 మిలియన్ల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. అన్ని కారణాలతో ప్రపంచ మరణాల రేటుతో ప్రస్తుత 9.3 శాతంగా ఉన్నది. అప్పుడే పుట్టిన ప్రతి ఐదుగురిలో ఒకరు (23 మిలియన్లు) ఏదో ఒక రకమైన హైపర్‌గ్లైసీమియాతో బాధపడుతున్నట్లు అంచనా.ప్రపంచవ్యాప్తంగా దాదాపు 9.15 మిలియన్ల మంది వ్యక్తులు టైప్-1 డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. ఇందులో 22.3 శాతం అంటే 2.04 మిలియన్ల మంది తక్కువ ఆదాయం, మధ్య ఆదాయ దేశాల్లో నివసిస్తున్నారు. ఈ మొత్తం 9.15 మిలియన్ జనాభాలో 1.81 మిలియన్లు (19.8 శాతం) 20 సంవత్సరాల కంటే తక్కువ వయసున్నవారు ఉన్నారు. 6.28 మిలియన్లు (68.6 శాతం 20-59 సంవత్సరాల మధ్య వయసుగల వారు, 1.06 మిలియన్లు 60 లేదా అంతకంటే ఎక్కువ వయస్సు గల వ్యక్తులు ఉన్నారు. జీవనశైలిలో మార్పులు, సరిగా తీసుకోకపోవడం, ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలతో మధుమేహం ముప్పుతుందని ఆరోగ్య నిపుణులు ఉన్నారు. ఇది కేవలం వృద్ధుల సమస్య కాదని.. పిల్లల నుంచి ప్రతీ ఒక్కరూ డయాబెటిస్‌కు బాధితులుగా మారుతున్నట్లు నివేదిక.

# మంచు కుటుంబంలో ముదురుతున్న వివాదం

హైదరాబాద్, నటుడు మోహన్‌బాబు కుటుంబం మరోమారు రోడ్డున పడింది. సొంత గొడవలతో పోలీస్ స్టేషన్ ఎక్కిన తనయులు తాజాగా మరో వివాదంతో ముందుకు వచ్చారు. ఇలా తాజాగా మరోసారి వార్తల్లో నిలిచింది. తన కారు పోయిందని పేర్కొంటూ మనోజ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసి,ఇదంతా తన సోదరుడు విష్ణు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం జల్‌పల్లి నివాసం వద్దకు చేరుకున్న మనోజ్.. గేటు బయట బైఠాయించి నిరసన తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తమది ఆస్తి గొడవ కాదన్నారు. తన జుట్టు విష్ణు చేతుల్లోకి ఇచ్చేందుకు ఇలా చేస్తున్నారని ఆరోపించారు. నాకు ఈ ఆస్తి వద్దని నాన్నకు ఎప్పుడో చెప్పాను. ఇది ఆస్తి గొడవ కాదు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఇదంతా. అక్కడే మొదలైంది ఈ గొడవ. డిసెంబర్ నుంచి గొడవలు జరుగుతున్నా పోలీసులు ఇప్పటివరకూ ఒక్క ఛార్జ్ షీట్ ఫైల్ చేయలేదు. కత్తులు, గన్‌లతో రౌడీలు మమ్మల్ని కొట్టడానికి వచ్చారు. దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను పోలీసులకు ఇచ్చాను. ఇంట్లో నా పెంపుడు జంతువులు, ఇతర వస్తువులు ఉన్నాయి. వాటికోసమే వచ్చా అని మనోజ్ చెప్పారు. పాప పుట్టినరోజు కోసం మేం జయపుర వెళ్లిన తర్వాత విష్ణు ప్లాన్ చేసి ఇదంతా చేశారు. విష్ణు అనుచరులు ఇంటికి వచ్చి కార్లను తీసుకెళ్లారు. నా సెక్యూరిటీ-పై దాడి చేశారు. కమిషనర్ ఇచ్చిన బైండోవర్‌ను వాళ్లు ఎన్నోసార్లు దాటారు. నేను తప్పు చేశానని, ఆస్తి అడిగానని ఒక్క సాక్ష్యాధారం బయటపెట్టమనండి. అప్పుడు వాళ్లందరి కాళ్లపై పడి క్షమాపణ కోరతా. చోరీ గురించి పోలీసులకు చెబుతున్నా యాక్షన్ తీసుకోవడం లేదు. నా సెక్యూరిటీ- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవట్లేదు. ఇప్పుడు నా ఇంట్లోకి వెళ్లడానికి ఆర్డర్ కావాలని పోలీసులు అడుగుతున్నారు. మోహన్‌బాబు చెబితేనే లోపలికి పంపిస్తానని అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నా విన్నపం ఒక్కటే. కోర్టు నోటీసులతో వచ్చినా లోపలకు పంపించడం లేదు. నా సమస్యను పరిష్కరించండని మనోజ్ విజ్ఞప్తి చేశారు. నా కుటుంబం నుంచి ఇప్పటివరకూ ఒక్క రూపాయి తీసుకోలేదు. బయట ప్రొడెక్షన్‌లో హిట్ కొడితే తీసుకొచ్చి సొంత నిర్మాణ సంస్థలో సినిమా చేయాల్సిందేనని అనేవారు. విష్ణు కెరీర్ నిలబెట్టడం కోసం లేడీ గెటప్ కూడా వేశా. వాళ్ల కోసం ఎంతో గొడ్డు చాకిరీ చేశా. అయినా ఎందుకింతలా దిగజారుతున్నారో అర్థం కావడం లేదు. 'కన్నప్ప'కు పోటీ-గా 'భైరవం' విడుదల చేద్దాం అనుకున్నాం. టెన్షన్ పడిపోయి కన్నప్ప వాయిదా వేసుకున్నాడు. ఆ కోపాన్ని ఎలా తీర్చుకోవాలో తెలియక ఇదంతా చేస్తున్నాడు. ఇప్పుడు నా తల్లిదండ్రులకు ఈ తలనొప్పులు అవసరమా? విష్ణు ప్రశాంతంగా కూర్చొని మాట్లాడవచ్చు కదా అని మనోజ్ వ్యాఖ్యానించారు.కారు చోరీపై నార్సింగి పోలీసులకు సమాచారం ఇవ్వగా అది విష్ణు ఇంట్లో ఉన్నట్లు- గుర్తించారు. రికవరీకి వెళ్లినప్పుడు దాన్ని మాదాపూర్‌కు పంపించారని మనోజ్ మీడియాతో చెప్పారు. ఈక్రమంలోనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటు-చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# డ్రాగన్ వస్తే దంచుడే!

న్యూఢిల్లీ,బంగ్లాదేశ్ చికెన్ నెక్ సమీపంలో వైమానిక స్థావరాన్ని ఏర్పాటుచేసుకుని నకరాలు పోతున్న డ్రాగన్‌ను చిత్తు చేసేందుకు భారత్ సర్వ సన్నద్ధమవుతోంది. భారతదేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో భూగర్భ అణు జలాంతర్గామి కోటను నిర్మించనుంది. తూర్పు నౌకాదళ కేంద్రం విశాఖపట్టణానికి దక్షిణంగా సుమారు 50 కిలోమీటర్ల దూరంలోని రాంబిల్లి గ్రామం అంతర్జాతీయ యుద్ధ నౌకస్థావరంగా అవతరిస్తోంది. ఇక్కడ భారత అణు జలాంతర్గాములు, యుద్ధనౌకలకు ఓ స్థావరాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇక పశ్చిమ తీరంలో కర్నాటకలోని కార్వార్ నౌకా స్థావరం విస్తరణ పనులు కూడా స్పీడందుకున్నాయి. సముద్ర రక్షణ వలయ సామర్థ్యాన్ని పెంచే దిశలో మరో అడుగు ఊపందుకుంది. తూర్పు తీరంలో రక్షణ అవసరాల కోసం నిర్మిస్తున్న నేవీ ప్రత్యామ్నాయ స్థావరం ఐఎన్ఎస్ వర్షను 2026లో ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఇది పూర్తిగా వ్యూహాత్మక స్థావరం.

ప్రత్యామ్నాయ నేవీ స్తావరం..

అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లి సముద్ర తీరాన్ని ఆనుకొని నేవీ ప్రత్యామ్నాయ స్థావరం నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం 670 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించింది. ఇక.. ఏపీ ప్రభుత్వం కూడా భూసేకరణలో సహరించింది. ఈప్రాజెక్టు తొలి దశ 2022 నాటికి, మలి దశ నిర్మాణం 2025 నాటికి పూర్తి కావాల్సి ఉంది. అయితే.. కొవిడ్ కారణంగా ఆలస్యమైంది. ప్రస్తుతం తొలి దశ నిర్మాణం పూర్తి కావొచ్చింది. అచ్యుతాపురంలో బాబా అటమిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్) నుంచి ఐఎన్ఎస్ వర్షకు సంపూర్ణ సహకారం అందుతోంది. అచ్యుతాపురంలో ఈ అటామిక్ రిసెర్చ్ సెంటర్‌కు 2,200 ఎకరాలు కేటాయించారు.

రిపేర్లు, నిర్వహణ అంతా ఇక్కడే..

రాంబిల్లి స్థావరంలో అణు జలాంతర్గాముల నిర్మాణమే కాకుండా.. మరమ్మతులు, నిర్వహణ వంటి అన్ని ఏర్పాట్లు ఉన్నాయి. ఈ కేంద్రంలో బంకర్లు, సొరంగ వ్యవస్థలు, ఇన్నర్, ఔటర్ హార్బర్ వంటి సౌకర్యాలున్నాయి. హైసెక్యూరిటీతో ఏర్పాటు చేస్తున్న ఈ వ్యూహాత్మక స్థావరం బంగాళాఖాతం, హిందూమహాసముద్ర ప్రాంతంలోని జలాల్లో నిఘాను పెంచనుంది. ముఖ్యంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో చైనా చర్యలను పసిగట్టేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

సబ్ మెరైన్ హబ్‌గా రాంబిల్లి..

శత్రువుల కంట పడని రీతిలో యుద్ధనౌక స్థావరాలను ఇప్పటి వరకూ రష్యా, చైనా మాత్రమే నిర్మించుకున్నాయి. ఆ కోవలోనే భారత్ కూడా రాంబిల్లి (ఐఎన్ఎస్ వర్ష)ను వ్యూహాత్మక స్థావరంగా ఎంచుకుంది. చైనాకు దీటైన సమాధానం చెప్పడమే దీని ప్రధాన ఉద్దేశం. ఇది భారత నౌకాదళానికి సబ్‌మెరైన్ల హబ్‌గా ఉంటుంది. ఇక్కడ 12 సబ్‌మెరైన్లను లంగరు వేసుకోవచ్చు. అందులో అణు జలాంతర్గాములకే అధిక ప్రాధాన్యం. హైనాన్ ద్వీపంలో చైనా అణు జలాంతర్గామి స్థావరం తరహాలోనే.. రాంబిల్లిలో సముద్రం నీటి లోతు ఎక్కువగా ఉంటుంది. దీంతో జలాంతర్గాములు ఉపగ్రహాల కంటపడే అవకాశాలు ఉండవు. సునాయశంగా నీటిలోకి చేరుకుంటాయి. బయటకు వెళ్లగలవు. వీటిని ఉపగ్రహాలు గానీ, నిఘా విమానాలు గానీ కనిపెట్టే చాన్స్ ఉండదు. సముద్రంలో టన్నెళ్ల గుండా సబ్‌మెరైన్లు హబ్‌కు చేరుకునేలా ఈ నిర్మాణం చేశారు. దీనికి పదేళ్లకుపైగా పట్టింది. 2014 ఆగస్టులో ఇక్కడ స్థావరాన్ని నిర్మిస్తున్నట్టు వార్తలు వెలువడ్డాయి.

అరిహంత్.. అరిఘాత్ దూకుడు..

విశాఖపట్నంలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో 2004 నుంచి న్యూక్లియర్ సబ్‌మెరైన్ల నిర్మాణం జరుగుతోంది. స్ట్రాటజిక్ స్ట్రయిక్ న్యూక్లియర్ సబ్‌మెరైన్స్ (ఎస్ఎస్‌బీఎన్) పేరుతో నాలుగు న్యూక్లియర్ సబ్‌మెరైన్ల నిర్మాణానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెసల్ (ఏటీవీ) ప్రాజెక్టును 2004లో ప్రారంభించారు. ఇందులో మొదటిది అరిహంత్ . దీని నిర్మాణానికి రష్యా సహకారం తీసుకున్నారు. 2009లో జల ప్రవేశం చేశారు.

# ఏందయ్యా మీది.. రోజుకో లొల్లి! అధిష్టానం సీరియస్




హైదరాబాద్, తెలంగాణ బీజేపీకి అధ్యక్షుడి ఎంపిక ఎంతకీ కొలిక్కి రావడం లేదు.. ఫలానా నాయకుడే ప్రెసిడెంట్ అని, ఇక ప్రకటనే తరువాయని ముహూర్తాలపై లీకులు తప్ప.. రాష్ట్ర పార్టీ పగ్గాలు ఎవరి అప్పజెప్తారో ఒక పట్టాన తేలడం లేదు. ఆ ఎఫెక్ట్‌తో రాష్ట్ర కాషాయ నేతలు పార్టీ ఇమేజ్ కంటే.. సొంత ఇమేజ్ పై ఫోకస్ పెడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక పూర్తి కాకపోవడంతో ఆశావహులు తమ వ్యక్తిగత ఇమేజ్ పెంచుకుని ఢిల్లీ పెద్దల దృష్టిలో పడటానికి పాకులాడుతున్నారనే టాక్ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది

తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడిపై కొనసాగుతున్న ఉత్కంఠ

తెలంగాణ బీజేపీలో సంస్థాగతంగా 2 జిల్లాలు మినహాయిస్తే అన్ని జిల్లాలకు కొత్త అధ్యక్షుల నియామక ప్రక్రియ పూర్తయ్యింది. ఇక రాష్ట్ర అధ్యక్షుడు ఎవరు అనేదానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. స్టేట్ బీజేపీ ప్రెసిడెంట్ ఎవరనేది మరో వారంలో తేలిపోనుందని అంటున్నారు. ఆ క్రమంలో రాష్ట్ర బీజేపీలో మాత్రం రోజు రోజుకు నేతల మధ్య ఆధిపత్య పోరు పెరిగిపోతోంది. తమ తమ వ్యక్తిగత ఇమేజ్‌లను పెంచుకునేందుకు మాత్రమే ఆరాట పడుతున్న నేతల తీరు ఆటు అధిష్టాన పెద్దల్లో , ఇటు పార్టీ క్యాడర్లో చర్చనీయాంశంగా మారుతోంది.

నేతల వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కాషాయ శ్రేణులు

రేవంత్‌రెడ్డి సర్కారు ఇచ్చిన హామీలు విస్మరించిందని, ప్రజలను నిలువునా మోసం చేసిందని మీడియా మైకుల ముందు స్పీచ్‌లు, సోషల్ మీడియాలో ఏఐ ప్రచారాలకే రాష్ట్ర బీజేపీ నేతలు పరిమితం అవుతుండటం విమర్శలపాలవుతోంది. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటాలు, ప్రజల పక్షాల ఆందోళనలు, ఉద్యమాలు నిర్వహిచడానికి మాత్రం కాషాయ నేతలు పెద్దగా ఇంట్రస్ట్ చూపించడం లేదు. ఎవరికి వారు వ్యక్తిగత ఎజెండాలతో వ్యవహారాలు నడిపిస్తూ.. పార్టీ జెండాలు, ఎజెండాలను పట్టించుకోకపోవడంపై కాషాయ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో కనిపిస్తున్నాయి

రాష్ట్రా సారథి ప్రకటన కోసం జిల్లా అధ్యక్షుల ఎదురుచూపు

రాష్ట్ర బీజేపీలో ఎవరిని కదిలించినా కొత్త అధ్యక్షుడు ఎవరనే దానిపైనే చర్చ జరుగుతోంది. అంతే కాదు. ఇటీవల కొత్తగా నియామకమైన జిల్లాల అధ్యక్షులు కూడా రాష్ట్ర సారథి అనౌన్స్ మెంట్ కోసమే ఎదురుచూస్తున్నారు. అధ్యక్ష రేసులో ఉన్న నేతలంతా తలో దిక్కు అన్నట్టుగా వ్యవహరిస్తూ.. ప్రసంగాలు తప్ప, మ్యాటర్ లేదనే అపవాదును మూట కట్టుకుంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే అధ్యక్షుడు ఎవరనేది తెలాకే పోరాటాలు మొదలు పెట్టాలనే ధోరణిలో నాయకులు ఉన్నారంట.

పోరాటాలే చేస్తే క్రెడిట్ కిషన్ రెడ్డికి దక్కుతుందంట

ప్రస్తుతం ఉన్న అధ్యక్షులు కిషన్ రెడ్డి ఎలాగో కొద్ది రోజుల్లో మారిపోతున్న నేఫథ్యంలో ఇప్పుడు గనక ప్రభుత్వంపై పోరాటాలకు దిగితే ఆ క్రెడిట్ కిషన్ రెడ్డికి వెళ్తుందంట. కాబట్టి కొత్త ప్రెసిడెంట్ వచ్చాకే పోరాటాలు మొదలు పెడితే నూతన చీఫ్ దృష్టిలో పడ్డట్టుగా ఉంటుందని కొత్తగా నియమితులైన జిల్లా పార్టీ అధ్యక్షులు అనుకుంటున్నట్టు టాక్ నడుస్తుంది. అంతేకాదు ఒకవేళ ఇప్పుడు పోరాటాలు చేసి ప్రస్తుతం ఉన్న ప్రెసిడెంట్ కు హైప్ ఎందుకు ఇవ్వాలనే యోచనలో పలువురు జిల్లా అధ్యక్షులు ఉన్నట్లు నేతలు చేవులు కోరుక్కుంటున్నారంట

పార్టీని నవ్వులపాలు చేసిన నేతల మూసీ నిద్ర

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ పెద్దగా ప్రజా వ్యతిరేక ఉద్యమాలు చేసిన దాఖలాలు లేవు. గ్రూప్ 1 అభ్యర్థులకు మద్దతుగా కేంద్రమంత్రి బండి సంజయ్, రైతు దీక్ష పేరిట బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన కార్యక్రమాలు మినహాయిస్తే .. చెప్పుకోదగ్గ స్థాయిలో ఒక్క ప్రోగ్రామ్ కూడా చేపట్టలేదని బీజేపీ నేతల మధ్య చర్చ నడుస్తోంది. అప్పట్లో మూసీ నిద్రల పేరుతో బీజేపీ నేతలు హడావుడి చేసినా.. అది పార్టీని నవ్వులపాలు చేసిందంటున్నారు.

రైతు సత్యాగ్రహ దీక్షకు జిల్లాల్లో స్పందన కరువు

ఇక పార్టీ జిల్లాల అధ్యక్షుల నియామకం తర్వాత ఇటీవల కాషాయ పార్టీ రాష్ట్ర నాయకత్వం, కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలనే డిమాండ్లతో రైతు సత్యాగ్రహ దీక్షకు పిలుపునిచ్చింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని స్పష్టంచేసింది. కానీ ఈ దీక్షలు అనుకున్నంత స్థాయిలో జరగలేదు. కొన్ని జిల్లాల్లో రైతు దీక్ష ప్రభావం పెద్దగా కనిపించలేదు. దాంతో కొత్తగా ఎన్నికైన జిల్లాల అధ్యక్షులు రాష్ట్ర నాయకత్వం పిలుపుని లైట్ తీసుకున్నారన్న టాక్ వినిపించింది.

ప్రజలను ప్రభావితం చేయలేకపోతున్న కాషాయ నేతలు

ప్రభుత్వ వ్యతిరేకత ప్రజల్లో ఉందో లేదో కానీ బీజేపీ, బీఆర్ఎస్ కలిసి చేస్తున్న ఏఐ ప్రచారాలు, ఉపన్యాసాలు మాత్రం ప్రజల దృష్టిని ఆకర్షించలేకపోతున్నాయి . అసలు విపక్షాల విమర్శలను ప్రజలు పట్టించుకుంటున్నట్లే కనిపించడం లేదంటున్నారు. అటు ప్రజలను ప్రభావితం చేయలేక, ఇటు సొంత పార్టీలో నేతల మధ్య రగులుతున్న కుంపట్లను చల్లార్చుకోలేని పరిస్థితుల్లో బీజేపీ ఉండిపోవడం ఇపుడు ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. వ్యక్తి గత ఇమేజ్‌ల కోసం పార్టీని డ్యామేజ్ చేసే పనిలో నేతలున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తున్న రాజాసింగ్

గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ స్వయంగా కిషన్‌రెడ్డితో పాటు సొంత పార్టీ ముఖ్యులపై చేస్తున్న కామెంట్లు ఎప్పటికప్పుడు ఆ పార్టీ పరువును బజారుకు ఇడుస్తున్నాయి. శ్రీరామ నవమి రోజున రాజాసింగ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా భారీ స్థాయి శోభా యాత్ర నిర్వహిస్తారు. కానీ ఈ సారి అందుకు భిన్నంగా అంబర్‌బేట్‌లో మరొక శోభా యాత్ర నిర్వహించడం అందులో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి హదాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. కావాలనే బీజేపీ రాష్ట్ర నాయకత్వం తన ఇమేజ్‌ను డ్యామేజ్ చేస్తోందని.. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఏం చేయలేరని రాజాసింగ్ ఫైర్ అవ్వడం ఆ పార్టీలో రచ్చ రేపుతోంది.

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని ఆశిస్తున్న కమలనాథులు

మొత్తం మీద రాష్ట్రంలో కాంగ్రెస్ప్రజా పాలన సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతున్న నేపథ్యంలో.. బీజేపీ నేతల మధ్య ఆధిపత్య పోరు ఆ పార్టీ ప్రతిష్టను మరింత దిగజారుస్తోందంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే బీఆర్ఎస్ స్థానంలో రాష్ట్రంలో రెండో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని ఆశిస్తున్న కమలనాథుల కలలు కల్లలుగానే మిగిలిపోతాయన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మరి రాష్ట్ర బీజేపీకికొత్త అధ్యక్షుడు వచ్చాకైనా తీరు మారుతుందా..? లేక సేమ్ తంతు కొనసాగనుందా అనేది చూడాలి.

# నో పాలిటిక్స్, ఓన్లీ ఫెస్టివల్స్ అంటున్నా.. జగ్గారెడ్డి



హైదరాబాద్,ఒకప్పుడు రాజకీయం అంటేనే జగ్గారెడ్డి జగ్గారెడ్డి అంటేనే రాజకీయం అన్నట్లు నడిపించారు. పాలిటిక్స్‌లో ఆ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఫైర్‌బ్రాండ్‌గా వెలుగొందారు.. కానీ ఇప్పుడు నో పాలిటిక్స్, ఓన్లీ ఫెస్టివల్స్ అంటున్నారంట. రాజకీయాలు వదిలేసిన జగ్గన్న రామభజన ఎందుకు చేసుకుంటున్నారు? సంగారెడ్డి నుంచి సిల్వర్ స్క్రీన్ వైపు ఎందుకు మనసు మళ్లింది? ఇంత సడెన్‌గా ఆయనలో ఎందుకంత మార్పు వచ్చింది? పొలిటికల్ ఫ్యూచర్ కోసం దేవుడిపై భారం వేస్తున్నారా?

ఫైర్ బ్రాండ్ ఇమేజ్ సొంతం చేసుకున్న జగ్గారెడ్డి

మాజీ ఎమ్మెల్యే, TPCC వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి. ఈ పేరు చెబితేనే ఫైర్ బ్రాండ్, మాస్ లీడర్ అని అందరూ అంటుంటారు. కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న జగ్గారెడ్డి ఈ సారి ఎన్నికల్లో ఓడిపోయారు. గెలిస్తే మాత్రం కచ్చితంగా మంత్రి పదవి ఆయనకి దక్కేదన్న టాక్ ఉంది. అయితే ప్రతికూల పరిస్థితుల్లో సైతం సంగారెడ్డిలో గెలుపు మెట్లు ఎక్కిన జగ్గారెడ్డికి గత ఎన్నికల్లో అదృష్టం కలిసి రాలేదు.

హాట్ టాపిక్‌గా మారిన జగ్గారెడ్డి సైలెన్స్

పార్టీని, పార్టీ నేతలను ఎవరైనా విమర్శిస్తే తనదైన శైలిలో ప్రతి విమర్శలు చేసే జగ్గారెడ్డి కొన్ని రోజులుగా మౌనంగా ఉంటున్నారు. దాంతో ఇప్పుడు ఆయన సైలెన్స్ కూడా రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. గాంధీ భవన్‌లో ప్రెస్ మీట్ లు పెట్టి మైకును మోత మోగించే జగ్గారెడ్డి ఇప్పుడు ఎందుకు సైలెంట్ అయ్యారోనని ఆయన అనుచరులే చర్చించుకుంటున్నారట. అకస్మాత్తుగా రాజకీయాలకు జగ్గారెడ్డి ఎందుకు దూరం అయ్యారోనని ఆరా తీస్తే రకరకాల లెక్కలు వినిపిస్తున్నాయి

ఢిల్లీలో జగ్గారెడ్డికి దొరకని రాహుల్ అపాయింట్‌మెంట్

ఇటీవల ఆయన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కలవడానికి ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దొరకకపోవడంతో ఆయన హైదరాబాద్ కి తిరుగు పయనం అయ్యారు. ఆ టూర్‌లోనే జగ్గారెడ్డిలో కొత్త కొత్త అవతారాలు బయటపడుతున్నాయంట. ఇన్ని రోజులు ఓ పొలిటికల్ లీడర్‌గా ఉన్న జగ్గారెడ్డి.. ఒక్కసారిగా తనలో ఓ యాక్టర్ ని రివీల్ చేశారట. వార్ ఆఫ్ లవ్ పేరుతో సినిమా తిస్తున్నట్లు ప్రకటించిన ఆయన ఉగాదికి హైదరాబాద్‌లో సినిమా ఆఫీసు ప్రారంభిస్తానని ప్రకటించారు. షూటింగ్‌లో కూడా పాల్గొంటానని వెల్లడించారు.

రామభజన , చేస్తూ భక్తిలో మునిగి తేలుతున్న జగ్గన్న

అదలా ఉంటే ఢిల్లీ పర్యటన అనంతరం జగ్గారెడ్డి హైదరాబాద్‌నిపూర్తిగా వదిలేశారన్న ప్రచారం జరుగుతుంది. తన నియోజకవర్గమైన సంగారెడ్డికే ఎక్కువగా టైం కేటాయిస్తున్నారట. అది కూడా రాజకీయాలు వదిలేసిన ఆయన సంగారెడ్డి ఓల్డ్ బస్టాండ్ రాం మందిర్‌లో రామభజన చేస్తూ భక్తిలో మునిగి తేలుతున్నారట. ప్రస్తుతం పాలిటిక్స్‌ని పక్కకు పెట్టి సంగారెడ్డిలో పండుగలు, భజనల్లో బిజీగా ఉన్నారంట. మహాశివరాత్రి రోజు సంగీత విభావరి పెట్టిన జగ్గారెడ్డి హెూలీ వేడుకల్ని అదే స్థాయిలో నిర్వహించారు. చిన్న, పెద్ద, మిత్రులు, అభిమానులతో కలిసి హెూలీ ఆడారు. హెూలీ అయ్యిందో లేదో మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.

సినిమాలో ఎంట్రీ ఇవ్వనున్న జగ్గూభాయ్

అది అయిపోగానే ఉగాది వేడుకలు,. శ్రీ రామ నవమి ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించారు. ఇలా పండుగ ఏదైనా కేరాఫ్ జగ్గారెడ్డి అనే విధంగా హడావుడి చేస్తున్నారంట. ఇక ఇన్నాళ్లు ఆయన్ని ఫుల్ టైం పొలిటీషియన్ గా చూసిన జనాలు త్వరలో ఇక సినిమా థియేటర్లలోనూ క్యారెక్టర్ యాక్టర్‌గా చూడనున్నారు. జగ్గారెడ్డి కాస్త భక్తిలో జగ్గానంద స్వామిగా మారడం%ౌ% సినిమాలో జగ్గూభాయ్ లా ఎంట్రీ ఇస్తుండటంతో ఆయన అభిమానులు, అనుచరులు ఖుషీలో ఉన్నా కాస్త కన్ఫ్యూజ్‌లో పడ్డారట.

జగ్గారెడ్డిలో వచ్చిన మార్పుతో తలలు పట్టుకుంటున్న అనుచరులు

పాలిటిక్స్ అంటే ప్రాణం పెట్టే జగ్గారెడ్డిలో ఈ మార్పు ఎందుకు వచ్చిందోనని అనుచర గణం అర్థం కాక తలలు పట్టుకుంటున్నారట. కొందరేమో మార్పు మంచిదే అంటున్నారట. మరి కొందరు మార్పు వెనుక ఏదో మర్మం ఉందని ఎవరికి తోచినట్టు వారు విశ్లేషించుకుంటున్నార. ఎప్పుడు రాజకీయాల్లో తన మాటలతో తూటాలు పేల్చే జగ్గారెడ్డి.. మౌనంతోను రాజకీయాల్లో మంట పుట్టిస్తున్నారిప్పుడు. మరి రాజకీయాలు వదిలేసి రామ భజన చేస్తున్న జగ్గారెడ్డి మళ్ళీ పొలిటికల్‌గా ఎప్పుడు యాక్టివ్ అవుతారో చూడాలి.

## ఒంటిమిట్టలో కళ్యాణోత్సవానికి భారీగా ఏర్పాట్లు

తిరుమల, కడప జిల్లా ఒంటిమిట్టలో శ్రీకోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 11న సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు అత్యంత వైభవంగా శ్రీసీతారాముల కళ్యాణాన్ని నిర్వహించనున్నారు. సిఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. టిటిడి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రామచంద్రుడి కళ్యాణానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. భక్తుల కోసం తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేసింది.

# ఆదాయ మార్గాలపై దృష్టి సారించండి

అమరావతి, రాష్ట్రంలో సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా సొంతంగా ఆదాయ మార్గాలు పెంచుకోవలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.. పన్నుల వసూళ్లు పెరిగేలా ఆదాయార్జన శాఖలన్నీ పనిచేయాలని అధికారులను ఆదేశించారు. మరిన్ని ఆదాయ మార్గాలను వెతకడంతో పాటు, ఎక్కడ ఆదాయం తక్కువుగా నమోదవుతుందో దానికి గల కారణాలను వెతికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. పన్నుల చెల్లింపుల దగ్గర నుంచి రశీదులు, నోటీసులు జారీ పక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరగాలని చెప్పారు. సచివాలయంలో ఆదాయార్జన శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ శాఖ ఇచ్చిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా రాష్ట్రంలో వెయ్యి మందికి పైగా బిల్డర్లు అసలు రిజిస్టర్ కాలేదని ఏఐ గుర్తించింది. అయితే, తప్పనిసరిగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే ప్రభుత్వం ఎటువంటి ఆమోదాలైనా తెలపాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.. పన్ను ఎగవేతదారులను పసిగట్టేందుకు ఏఐని వినియోగించుకోవాలని ఆదేశించారు.. అన్ని ఆదాయార్జన శాఖల్లోనూ ఇదే తరహా పక్రియ అమలు చేసి పకడ్బందీగా పన్ను వసూళ్లు చేయాలన్నారు. -టె-క్నాలజీని వినియోగించుకోవడం ద్వారా వ్యాపారులకు పన్ను చెల్లింపులు, అనుమతులు వంటివి సులభతరం అవుతున్నాయనే విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. గత ప్రభుత్వంలా వ్యాపారులను వేధించడం కూటమి ప్రభుత్వ విధానం కాదని.. వారితో సమన్వయం చేసుకుంటూ నిబంధనల ప్రకారం రావాల్సిన పన్నులన్నీ చెల్లించేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. పన్నుచెల్లింపుదారులు, జీఎస్టీ పోర్టల్, ఏపీ రాష్ట్ర డేటా సెంటర్, ఏపీసీటీ-డీ.. ఇలా మొత్తం శాఖల సమాచారాన్ని ఏఐతో అనుసంధానించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు నోటీసుల జారీకి, గ్రీవెన్స్‌లు స్వీకరించడానికి ఏఐని వినియోగించి ప్రభుత్వ యంత్రాంగంలో మరింతం వేగం పెంచవచ్చని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న రాష్ట్ర సొంత ఆదాయ లక్ష్యం రూ.1,37,412 కోట్లను 100 శాతం ఆర్జించేలా అన్ని శాఖలు కృషి చేయాలని చెప్పారు సీఎం చంద్రబాబు.. రాష్ట్ర సొంత ఆదాయంలో 2.2 శాతం వృద్ధి కనిపించింది అన్నారు సీఎం.. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2024-25కి గాను రాష్ట్రానికి సొంతంగా ఆదాయంలో 2.2శాతం వృద్ధి నమోదైందని.. రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో వృద్ధి 4.1 శాతం పెరగ్గా, పన్నేతర ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో లేదన్నారు.. జీఎస్టీలో 4.9శాతం వృద్ధి, ప్రొఫెషనల్ ట్యాక్స్‌లో 15.2శాతం వృద్ధి, ఎక్సైజ్ ఆదాయంలో 24.3 శాతం వృద్ధి నమోదైందన్నారు. కొత్త పాలసీ ప్రకటించిన దగ్గర నుంచి ఆదాయాన్ని పరిశీలిస్తే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గతం కన్నా మెరుగుపడింది.. అక్టోబర్ 2024 నుంచి మార్చి 2025 వరకు రూ. 4,330 కోట్ల ఆదాయం రాగా, దాదాపు 33 శాతం ఆదాయం పెరిగింది. అలాగే, మున్సిపల్ శాఖలో 2023-24 కంటే 2024-25లో రూ.500 కోట్లకు పైగా ఆదాయం అదనంగా వచ్చింది. పన్నులకు సంబంధించి ఇంకా సుమారు రూ.2,500 కోట్ల బకాయిలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆస్తులకు సంబంధించిన పన్నులు, అలాగే, ఖాళీ స్థలాల పన్నులు అధికంగా వసూలు కావాల్సి ఉన్నాయి. మార్చి నెలలో ప్రకటించిన 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించడంతో కేవలం 6 రోజుల్లోనే మొత్తం ఆస్తిపన్నులు రూ.240 కోట్లు- వసూలయ్యాయని అధికారులు తెలిపారు...

# సోషల్ మీడియా చెలగాటం..

హైదరాబాద్,తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై సోషల్ మీడియా అటాక్ తీవ్ర తలనొప్పిగా మారింది. 15 నెలల క్రితం వరకు సోషల్ మీడియా వాడకంలో ఆరితేరిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ అస్త్రాన్ని కోల్డ్ స్టోరేజిలో పెట్టడంతో ప్రత్యర్థులకు అడ్డంగా దొరికిపోతున్నారని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ సోషల్ సైనికుల అటాక్ తో కాంగ్రెస్ ప్రభుత్వం విలవిల్లాడిపోతోంది. దీనికి ప్రత్యక్ష ఉదాహకరణ కంచ గచ్చిబౌలి భూ వివాదమే అంటున్నారు. కంచ గచ్చిబౌలిలో బుల్డోజర్ తో కూల్చివేతలు అంటూ ఏఐ జనరేటెడ్ ఫొటోలు పెద్ద ఎత్తున ప్రచారంలోకి రావడం, సుప్రీంకోర్టు కూడా సుమోటాగా స్పందించడం ప్రభుత్వానికి చికాకు తెచ్చింది. దీనిపై సీరియస్ అయిన సీఎం సోషల్ మీడియాను అదుపు చేయాలని నిర్ణయించారంటున్నారు. అయితే 15 నెలల క్రితమే తాను దిగిపోయిన పులిపై మళ్లీ స్వారీ చేయడం అంటే అంత ఈజీనా? అనే ప్రశ్న తలెత్తుతోంది.చాలాకాలంగా తెలంగాణలో సోషల్ మీడియాతో ప్రభుత్వం యుద్ధం చేయాల్సివస్తోంది. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన మీడియాకైనా, సోషల్ మీడియాకైనా హైదరాబాదే కేంద్రంగా ఉంటోంది. దీంతో తెలంగాణ ప్రభుత్వం మరింత ఎక్కువ ఇబ్బందులు పడుతోంది. చీమ చిటుక్కుమన్నా హైదరాబాదులో ఉండే సోషల్ మీడియా విస్తృతంగా ప్రచారం చేస్తుండటంతో ప్రభుత్వంపై నెగిటివ్ టాక్ ఎక్కువైపోతోంది. వాస్తవానికి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు అమలు చేయడంతోపాటు ఊహించని విధంగా పథకాలు అమలు చేస్తున్నా, పాజిటివ్ ప్రచారం చేసుకోలేకపోతున్నారు. దీనికి ప్రధాన కారణం సోషల్ మీడియాలో జరుగుతున్న చెబు ప్రచారాన్ని కట్టడి చేయలేకపోవడమే అని అంటున్నారు.ప్రస్తుతం రాజకీయాలు అన్నీ సోషల్ మీడియా వేదికగానే తిరుగుతున్నాయి. ప్రభుత్వమైనా, ప్రతిపక్షమైనా తాము ఏం చేసిన సోషల్ మీడియా ద్వారానే చెప్పుకోవాల్సివస్తోంది. గతంలో ప్రభుత్వం తన పథకాలు చెప్పుకోడానికి ప్రజల వద్దకు వెళ్లడంతోపాటు బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించేది. అదే ప్రతిపక్షమైతే రోడ్డెక్కి పోరాడేది. కానీ ఇప్పుడు ఎవరైనా సోషల్ మీడియాలోనే తమ వాదన వినిపించాల్సివస్తోంది. ఈ వేదికను సమర్థంగా వినియోగించుకున్నవారే ప్రజల ఆదరణ పొందుతున్నారని విశ్లేషణలు ఉన్నాయి. మరోవైపు గత రాజకీయాలకు సోషల్ మీడియా యుగంలోని పాలిటిక్స్కు మధ్య ఉన్న వ్యత్యాసం కూడా ప్రభావం చూపుతుంది. గతంలో నైతిక ప్రమాణాలు, సిద్ధాంతాలు, కట్టుబాట్లు, ఆచారాలు వంటివి పాటించేవారు. కానీ, ఇప్పుడు సోషల్ మీడియాలో అలాంటి పద్ధతులకు ఈసుమంతైనా చోటు ఉండటం లేదు. దీంతో విలువలు పాటించేవారు ఇక్కడ వెనక్కి పోతున్నారంటున్నారు. అలా అని సోషల్ మీడియాలో విర్రవీగిన వారు అడ్రస్ లేకుండా పోతున్నారు. దీనికి ఏపీలోని ఓ పార్టీని ఉదహరిస్తున్నారు. దీంతో సోషల్ మీడియా మేనేజ్మెంట్ అనేది ఓ కళగా మారుతోంది. ఈ విషయంలో తెలంగాణలో అధికార పార్టీ కన్నా ప్రతిపక్షం బలంగా ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.ప్రధాన మీడియా మాదిరిగా సోషల్ మీడియాకు రూల్స్ అంటూ ఏవీ అడ్డు లేకపోవడం కూడా తెలంగాణ ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారుతోందని అంటున్నారు. ప్రభుత్వంపై అపోహలు పెంచడమే టార్గెట్ గా పెట్టుకున్న సోషల్ మీడియాను అడ్డుకోడానికి ప్రభుత్వం కేసులు పెడుతున్నా, వెంటనే బెయిల్ తెచ్చుకుంటున్న వారు మళ్లీ తమ ప్రతాపం చూపుతుండటం, ఈ లోగా జరగాల్సిన నష్టం జరిగిపోతోందని అంటున్నారు. దీంతో రేవంత్ ప్రభుత్వం చేసిన మంచిని చెప్పుకోలేకపోతోందని అంటున్నారు. తాజాగా రాష్ట్రంలో తెల్లకార్డు దారులు అందరికీ సన్నబియ్యం పంపిణీ చేసిన గొప్ప కార్యక్రమంపైనా పెద్దగా ప్రచారం చేసుకోలేకపోయిందని అంటున్నారు.

# దేశీయంగా సంస్కరణలకు ఇదే సమయం



న్యూఢిల్లీ, ప్రస్తుతం అమెరికా-చైనా మధ్య తీవ్రస్థాయిలో జరుగుతున్న వాణిజ్యయుద్ధం భారత్‌కు మంచి అవకాశాలు సృష్టిస్తుందని ప్రముఖ ఆర్థికవేత్త, ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు తలపడినప్పుడు వాణిజ్యంలో కొంత అస్థిరత ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో భారత్ సరైన నిర్ణయాలు తీసుకొంటే లబ్ధి పొందుతుందన్నారు. అయితే ట్రంప్ నిర్ణయాలతో అమెరికా సెల్ఫ్‌గోల్ చేసుకొందని రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. భారత్ చురుగ్గా వ్యవహరించి పెట్టుబడులు పెరిగేలా.. ఎగుమతులకు ప్రోత్సాహం లభించేలా అమెరికాతో వాణిజ్య చర్చలు జరపాలని అన్నారు. భారత్ ఇప్పుడు ఒక్క అమెరికాపైనే కాకుండా .. టారిఫ్‌ల విధానాన్నే పూర్తిగా సరళీకరించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. భారత్ ఇప్పుడు ఆర్థిక రక్షణాత్మక వైఖరి నుంచి దూరంగా జరిగి.. వాణిజ్య, పెట్టుబడుల వాతావరణాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉందని రాజన్ అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితులను అవకాశాలుగా భావించి భారత్ నిర్ణయం తీసుకోవాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించేలా దేశీయంగా సంస్కరణలను చేపట్టాలని చెప్పారు. తూర్పు, ఉత్తర దేశాలతోపాటు- ఆర్సీఈపీ, ఆసియాన్ వంటి గ్రూపులు, చైనా, జపాన్ వంటి దేశాలతో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకోవాలన్నారు. బీజింగ్‌తో న్యూఢిల్లీ వాణిజ్య లోటు- ఉన్నా.. బ్యాలెన్స్‌గా వ్యవహరించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ట్రంప్ నిర్ణయాలు స్వల్పకాలానికి అమెరికాకు సెల్ఫ్‌గోల్‌లా పనిచేస్తాయని రాజన్ హెచ్చరించారు. ఆ దేశంలో నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టి.. ఫెడ్ వడ్డీరేట్లు- తగ్గించేందుకు సౌకర్యవంతంగా ఉన్న సమయంలో.. సొంత ఆర్థికవ్యవస్థనే ఆయన పట్టాలు తప్పిస్తున్నారన్నారు. అమెరికాకు ఎగుమతులు చేయడంపై ఆధారపడిన వియత్నాం వంటి దేశాలు ఈ నిర్ణయాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయని చెప్పారు. వీటితో పోలిస్తే భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం పరిమితిగా ఉంటుందని చెప్పారు. మన జీడీపీతో పోలిస్తే ఎగుమతులు తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని రాజన్ అభిప్రాయపడ్డారు. మన వృద్ధిరేటు పైనా పెద్దగా ప్రతికూల ప్రభావం ఉండదన్నారు. ట్రంప్ టారిఫ్‌ల దెబ్బను తప్పించుకోవడానికి చైనా నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకొన్న కంపెనీలకు భారత్ ఓ ఆకర్షణీయమైన ప్రదేశమని రాజన్ వెల్లడించారు. మనం సరైన నిర్ణయాలు తీసుకొంటే.. అమెరికా తక్కువ టారిఫ్‌లు విధించిన దేశాల్లో భారత్ ఉండటం, దేశీయంగా ఉన్న బలమైన మార్కెట్ వంటి భారీగా పెట్టు-బడులను తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించే నిర్ణయాలు తీసుకోవడంతోపాటు-.. పన్ను చట్టాలను మరింత సరళీకరించాలి. భారత్‌కు సేవారంగ ఎగుమతులకు మాత్రం టారిఫ్‌ల సెగ తాకలేదని చెప్పాలని రాజన్ వివరించారు. ఇటీ-వల కాలంలో దేశంలో సేవారంగ ఎగుమతులు తయారీ రంగాన్ని దాటేశాయన్నారు. ఇక అమెరికా టారిఫ్‌లు భారత్‌లో ద్రవ్యోల్బణ నియంత్రణకు కూడా ఉపయోగపడే అవకాశాలున్నాయని చెప్పారు. భారత ఎగుమతులు తూర్పు ఆసియా వంటి మార్కెట్ల వైపు చూస్తాయని.. అదే సమయంలో దేశీయ మార్కెట్లు- కూడా వాటిని ఆకర్షిస్తాయని చెప్పారు. ఇక చైనా ఉత్పత్తులకు అమెరికాలో ప్రవేశం కష్టం కావడంతో.. భారత్ వైపు మళ్లే అవకాశం ఉన్నట్లు- వెల్లడించారు. ఇక టారిఫ్‌లు ఇలానే కొనసాగితే మాత్రం ప్రపంచంలో ఆర్థిక మాంద్యం ఏర్పడే ప్రమాదం ఉందని రాజన్ అంచనా వేశారు.

# కసిరెడ్డికి మూడినట్టే నెక్ట్స్ మిథున్ రెడ్డే?



విజయవాడ: మూడు సార్లు పిలిచారు. మూడు సార్లు డుమ్మా కొట్టారు. హైకోర్టు చెప్పినా వినలేదు. ఏపీ లిక్కర్ అక్రమాల కేసులో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పదే పదే పారిపోతున్నారు. సీఐడీ నోటీసులను కేర్ చేయకుండా.. సిట్ విచారణకు అటెండ్ కాకుండా.. ముచ్చటగా మూడోసారి కూడా డుమ్మా కొట్టారు. కసిరెడ్డి తీరుపై సీఐడీ సీరియస్‌గా ఉందా? ముందుముందు క్రొకడైల్ ఫెస్టివల్ తప్పదా?

**లిక్కర్ మాస్టర్ మైండ్ కసిరెడ్డినే?**

అంతా కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డినే చేశారని ఆ పార్టీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సూటిగా చెప్పేశారు. ఏపీ లిక్కర్ స్కాంలో కసిరెడ్డినే కీలక సూత్రధారి అని సీఐడీ కూడా భావిస్తోంది. గత ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా పని చేసిన రాజశేఖర్‌రెడ్డి.. జగన్‌కు చాలా క్లోజ్ అంటారు. ప్రభుత్వ మద్యం పాలసీ అంతా ఆయన కనుసన్నల్లోనే జరిగిందని చెబుతారు. ఏపీలో ఏ బ్రాండ్లు అమ్మాలి? ఎంత రేట్‌కు అమ్మాలి? ఎవరి నుంచి కొనాలి? అసలు రేట్ ఎంత? తెరవెనుక డీల్ ఎంత? ఇలా గోల్‌మాల్ యవ్వారమంతా కసిరెడ్డినే నడిపించారని సీఐడీ ఆరోపణ. అందులో నిజానిజాలు విచారించడానికి రమ్మంటే ఆయన మాత్రం రాను రానంటూ మూడుసార్లు తప్పించుకున్నారు. హైకోర్టుకు వెళ్లి రిలీఫ్ కోరుకున్నా.. ముందస్తు నోటీసులు ఇచ్చి.. టైమ్ ఇచ్చి.. ఎంక్వైరీ చేసుకోవచ్చని చెప్పింది. హైకోర్టు ఆదేశాల మేరకు మార్చి 25న సీఐడీ నోటీసులు ఇచ్చింది. ఏప్రిల్ 9న విచారణకు రావాలని పిలిచింది. కానీ, కసిరెడ్డి మాత్రం ఈసారి కూడా డుమ్మా కొట్టారు.

**కసిరెడ్డి వస్తే.. వాళ్లకు చిక్కులేనా?**

ఎందుకు? రాజశేఖర్‌రెడ్డి అంతగా ఎందుకు భయపడుతున్నారు? సీఐడీ విచారణకు ఎందుకు రావట్లేదు? అడ్డంగా దొరికిపోతాననా? పక్కా ఆధారాలు ఉన్నాయి కాబట్టి.. తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా.. అనే రొటీన్ డైలాగ్స్ చెప్పడం కుదరదని బెదిరిపోతున్నారా? సీఐడీ ముందుకు వస్తే.. అసలు పెద్దల పేర్లు చెప్పాల్సి వస్తుందనా? వివేకానంద హత్య కేసులో సాక్షులు వరుసగా చనిపోతుండటం చూసి.. తనకు కూడా ఏదైనా జరగరానిది జరిగిపోతుందని హడలి పోతున్నారా? ఇలా అనేక ప్రశ్నలు.

**మిథున్‌రెడ్డికి చెక్ పెట్టేందుకేనా?**

ఏపీ లిక్కర్ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డికి కూడా సిట్ నోటీసులు ఇచ్చింది. విచారణకు సహకరించాలని మిథున్ రెడ్డికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మిథున్‌రెడ్డిని విచారించముందే కసిరెడ్డిని ప్రశ్నిస్తే.. ఆయన ఇచ్చిన సమాచారంతో కింగ్ పిన్‌కు చెక్ పెట్టొచ్చనేది సీఐడీ ఆలోచనలా కనిపిస్తోంది. అందుకే, కసిరెడ్డికి మూడుసార్లు నోటీసులు ఇచ్చి ఎంక్వైరీకి రప్పించే ప్రయత్నం చేసినా ఆయన మాత్రం డుమ్మా కొడుతూ వస్తున్నారు. విచారణకు వెళ్లకుండా కసిరెడ్డిని ఎవరైనా అడ్డుకుంటున్నారా? బెదిరిస్తున్నారా? కీలక సూత్రధారిని ఎక్కడైనా దాచేశారు? ఆయన నోరు విప్పితే తమకు చిక్కులు తప్పవని.. ఆనాటి వైసీపీ పెద్దలే ఇప్పుడు తెరవెనుక నుంచి కట్టడి చేస్తున్నారా? అనేది తేలాల్సి ఉంది.

# దేశీయంగా ఆక్వా మార్కెట్ పెంచాలి



ఏలూరు,మన దేశ ఆక్వా ఎగుమతులపై అమెరికా 26 శాతం సుంకం విధించడంతో రొయ్యల సాగు రైతులు బేజారవుతున్న వేళ,చంద్రబాబు ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.రొయ్యలను దేశంలోని మార్కెట్లకు ఎగుమతి చేసి, నష్టాలను పూడ్చుకునేలా ఆక్వా రైతులకు తోడ్పాటు ఇవ్వాలి. దీంతో మాంసం ప్రియులకు రొయ్యలు అందుబాటులోకి వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఈ సంక్షోభాన్ని వ్యాపార అవసరంగా మార్చుకోగలిగితే మంచిది. ట్రంప్ టారిఫ్‌లతో మన ఆక్వా రంగం కుదేలవుతున్న వేళ దేశీయంగా మార్కెట్‌ను పెంచితే మంచిది. దేశంలో 60శాతం మంది మాంసం ప్రియులకు రొయ్యలు దక్కడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భరోసా ధర కల్పించి రైతులకు ఊరట కల్పించేలా చర్యలు తీసుకోవాలి.సవాలక్ష సమస్యతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు అమెరికా విధించిన 26 శాతం సుంకం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే ఆక్వా రైతులు సమావేశాలు ఏర్పాటు- చేసుకుని ఒక నిర్ణయానికి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటి, రెండు రోజుల్లో స్పందించి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే మూకుమ్మడిగా క్రాప్‌హాలిడే ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తున్నారు. అయితేఇం÷-దుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలి. వంద కౌంట్‌ను రూ.220కు కొనుగోలు చేయాలని ఎగుమతి వ్యాపారులకు చంద్రబాబు సూచించారు. అయితే, ఈ ధర తమకు గిట్టుబాటు- కాదని రైతులు అంటున్నారు. మిర్చి రైతుల పరిస్థితి మాదిరిగానే తమ పరిస్థితీ మారనుందని, భవిష్యత్తులో ఈ ధర పెరగకపోగా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, విద్యుత్ కోతలను అధిగమించి రైతులు ఈ ఏడాది రొయ్యలను సాగు చేశారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో రొయ్యలకు మంచి ధర లభించింది. 30 కౌంట్‌కు రూ.610 చొప్పన అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. అదే సమయంలో 100 కౌంట్ ధర రూ.260 నుంచి రూ.270 వరకూ పలికింది. దీంతో, వేసవిలో కూడా లాభాల పంట పండిస్తుందనే ఆశతో మార్చిలో రైతులు ఉత్సాహంగా సాగు ప్రారంభించారు. అయితే, అమెరికా ప్రతీకార సుంకం ప్రభావం ఆక్వా రంగంపై తీవ్రంగా పడింది. రొయ్యల ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. 100 కౌంట్ రూ.200కు పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరపై రైతులు పెదవి విరుస్తున్నారు. కౌంట్ ఒక్కంటికీ రూ.20 నష్టం ప్రస్తుతం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్ద రైతుల వద్ద రూ.10 వ్యత్యాసంలో ఆ ధరకు కొనుగోలు చేస్తున్నారు, చిన్న రైతులను దళారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు రూ.20 నుంచి రూ.30 వరకూ కోత విధిస్తున్నారు. చెరువు నుంచి పట్టిన తర్వాత నిల్వ చేసుకునే అవకాశాలు లేకపోవడంతో తెగనమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా వైఖరిలో మార్పులేకపోతే భవిష్యత్తులో ధర మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 50 కౌంట్ రూ.320కు మించడంలేదు. 80 కౌంట్ రూ.240 మాత్రమే ఉంది. అత్యధిక మంది రైతుల వద్ద 100 కౌంట్ పంట ఉంది. ఎకరా విస్తీర్ణంలో రొయ్యల సాగుకు రూ.90 వేల నుంచి రూ.1.25 లక్షలకు వరకూ పెట్టుబడి అవుతోంది. ఎకరాకు 3 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుంది. పంట బాగా ఉంటే ఒక్కోసారి 5 టన్నుల వరకూ కూడా వచ్చే అవకాశం ఉంది. .ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన ధరకు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ నష్టం వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1.10 లక్షలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 80 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది.

# కీలక వడ్డీరేట్లను సవరించిన ఆర్బిఐ




ముంబై, విశ్లేషకుల అంచనాలను నిజం చేస్తూ కీలక వడ్డీ రేట్లను ఆర్‌బీఐ మళ్లీ సవరించింది. వరుసగా రెండోసారి రెపో రేటును 0.25 శాతం మేర తగ్గించింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. దీంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి దిగొచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ కీలక వడ్డీరేట్లను కేంద్ర బ్యాంకు 25 బేసిస్ పాయింట్లు- తగ్గించిన సంగతి తెలిసిందే. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. రెపో రేటుపై 25 బేసిస్ పాయింట్లు- తగ్గించినట్లు- ఆయన వెల్లడించారు. దీంతో గృహరుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయి. రెపోరేటును 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గించినట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. రెపో రేటు- తగ్గించడం వల్ల .. బ్యాంకులపై రుణభారం తగ్గనున్నది. దీని వల్ల బ్యాంకులు కూడా కస్టమర్లకు తక్కువ రేటుకే వడ్డీ ఇచ్చే అవకాశాలు ఉంటాయి. ఫలితంగా రుణాలపై ఈఎంఐలు తగ్గే ఛాన్సు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. రెపో రేటను 6 శాతానికి తగ్గించాలని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు- ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా తెలిపారు. తగ్గింపు నిర్ణయానికి మానిటరీ పాలసీ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు. ఈ సందర్భంగా స్థిర విధానం నుంచి సర్దుబాటు వైఖరికి మరాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. వడ్డీరేటు తగ్గింపుతో గృహ, వాహన, ఇతర రుణాల వడ్డీరేట్లు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు పెట్టుబడులు, వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపించ నున్నాయి. ఫలితంగా వృద్ధి రేటు నెమ్మదించొచ్చని కూడా గవర్నర్ అభిప్రాయపడ్డారు. అధిక సుంకాలతో ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. తయారీ రంగం పునరుద్ధరిస్తున్న సంకేతాలు కన్పిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు- 6.5శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయి. తొలి త్రైమాసికంలో 6.5శాతం, రెండో త్రైమాసికంలో 6.7శాతం జీడీపీ నమోదవ్వొచ్చని అంచనా. మూడు, నాలుగు త్రైమాసికాల్లో వృద్ధిరేటు వరుసగా 6.6శాతం, 6.3శాతం ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పడుతుండటంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4శాతానికి దిగి రావొచ్చని అంచనా. త్రైమాసికాల వారీగా 3.6శాతం, 3.9శాతం, 3.8శాతం, 4.4శాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఏప్రిల్ 4వ తేదీ నాటికి విదేశీ నిల్వలు 676 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వీటితో రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. ఇకపోతే బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలకు సంబంధించి నిబంధనలు కఠినతరం కానున్నాయి. దీనికి సంబంధించి మార్గదర్శకాలు జారీ చేస్తామని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. దీంతో ముత్తూట్ ఫైనాన్స్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ వంటి రుణ జారీ సంస్థల షేర్లు భారీగా క్షీణించాయి. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం ఇటీవల విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో వీటిని అడ్డుకొనేందుకు ఆర్‌బీఐ చర్యలకు సిద్ధమవుతోందని కొన్నిరోజుల క్రితమే వార్తలు వచ్చాయి. దీనిపై ఆర్‌బీఐ తాజాగా స్పందించింది. వివిధ రకాల నియంత్రణ సంస్థలు అనుసరిస్తున్న మార్గదర్శకాలను సమన్వయం చేయడంతో పాటు, సాధ్యమైనంత వరకు రిస్క్ తగ్గించేందుకు త్వరలో సమగ్ర నిబంధనలతో మార్గదర్శకాలు జారీ చేస్తామని పేర్కొంది. ఎంపీసీ సమావేశ వివరాల వెల్లడి సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్‌బీఐ ప్రకటనతో ముత్తూట్ ఫైనాన్స్ షేర్లు ఇంట్రాడేలో 10 శాతం మేర పతనం అయ్యాయి. బీఎస్ఈలో ఆ కంపెనీ షేర్లు రూ.2063కు చేరాయి. ఐఐఎఫ్ఎల్ షేర్లు సైతం 8 శాతం మేర క్షీణించాయి. మణప్పురం షేర్లు 3 శాతం, చోళమండలం షేర్లు 4.7 శాతం మేర పడ్డాయి. ముత్తూట్ ఫైనాన్స్ జారీ చేసే రుణాల్లో 98 శాతం వరకు బంగారం తాకట్టుగా పెట్టుకుని ఇచ్చేవే అధికం కావడంతో ఆ కంపెనీ షేర్లు ఎక్కువగా ప్రభావితం అయ్యాయి. మణప్పురం 50 శాతం, ఐఐఎఫ్ఎల్ 21 శాతం చొప్పున మొత్తం రుణాల్లో వాటాను కలిగిఉన్నాయి. రుణాల జారీ విషయంలో ఆర్థిక సంస్థలేవీ ఒకేతరహా విధానాలు పాటించడం లేదని ఆర్‌బీఐ గుర్తించింది. బంగారం తాకట్టు రుణాల జారీ నుంచి ఆ నగదు వినియోగం, వేలం వరకు ఇలా ప్రతి దానికీ విధివిధానాలను ఖరారు చేసే అవకాశం ఉంది.

# ట్రంప్ నిర్ణయాలతో మార్కెట్లపై ప్రభావం



న్యూఢిల్లీ, అగ్రరాజ్యం అమెరికా, డ్రాగన్ దేశం చైనా మధ్య టారిఫ్ వార్ మరింత ముదిరింది. ఈ వ్యవహారం ఆసియా మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. ట్రంప్ సుంకాల నిర్ణయంతో లక్షల కోట్లు మదుపురుల పెట్టబడి ఆవిరవుతోంది. దేశంలో వ్యతిరేకత వస్తున్నా..అనేక దేశాలు హెచ్చరిస్తున్నా ట్రంప్ మూర్ఖంగా వ్యవహరి స్తున్నారు. ఈ క్రమంలో ట్రంప్ బెరింపులను చైనా కూడా పట్టించుకోవడం లేదు. అమెరికా ఇటీవల ప్రతీకార సుంకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సుంకాలపై చైనా గట్టిగానే బదులిచ్చింది. డ్రాగన్ దేశం సైతం ప్రతీకార సుంకాలను ప్రకటించింది. అయితే, సుంకాలను వెనక్కి తీసుకోవాలని.. లేకపోతే మరింత సుంకాలను ప్రకటించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. చైనా వెనక్కి తగ్గకపోవడంతో ట్రంప్ అన్నంత పని చేశారు. చైనా వస్తువులపై భారీగా సుంకాలను ప్రకటించారు. తాజా సుంకాలతో 104శాతానికి సుంకాలు చేరాయి. కొత్తగా ప్రకటించిన సుంకాలు వెంటనే అమలులోకి వస్తాయని వైట్‌హౌస్ వెల్లడించింది. ఏప్రిల్ 2న అమెరికా చైనాపై 34శాతం సుంకాలను విధించింది. దీనికి స్పందనగా డ్రాగన్ దేశం సైతం అగ్రరాజ్యంపై 34శాతం సుంకాలు విధించింది. చైనా కొత్తగా ప్రకటించిన 34శాతం సుంకాలను ఉపసంహరించుకోకపోతే 50శాతం అదనంగా సుంకాలను ప్రకటిస్తామని ట్రంప్ హెచ్చరించారు.

ఏప్రిల్ 9 నుంచి అమలులోకి వస్తాయని.. దాంతో పాటు చైనాతో అన్ని చర్చలు సైతం రద్దు చేస్తామని స్పష్టంచేశారు. దీనికి అమెరికా ప్రతీకార సుంకాలు ఏకపక్షమని.. రెచ్చగొట్టడమేన ంటూ చైనా స్పందించింది. తాము సైతం ప్రతీకార సుంకాలను ప్రకటించామని.. భవిష్యత్‌లోనూ మరిన్ని సుంకాలు పెంచుతామని ఘాటు-గా బదులిచ్చింది. సార్వభౌమాధికారం, భద్రతా, అభివృద్ధి తదితర ప్రయోజనాలు కాపాడుకునేందుకు ప్రతీకార చర్యలు తీసుకుంటామని చైనా వాణిజ్యమంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. ఏప్రిల్ 2న ట్రంప్ భారత్‌పై 26శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.వియత్నాంపై 46 శాతం, చైనాపై 34 శాతం, తైవాన్‌పై 32 శాతం, దక్షిణ కొరియాపై 25 శాతం, జపాన్‌పై 24 శాతం, యూరోపియన్ యూనియన్‌పై 20 శాతం సుంకాన్ని ప్రకటించారు. ఆయా దేశాలు అమెరికాపై చాలా ఎక్కువ సుంకాలను విధిస్తున్నాయని, వాటిపై ప్రతీకార సుంకాలను విధిస్తున్నామని ట్రంప్ వ్యాఖ్యానించారు. యూఎస్-చైనా టారిఫ్ వార్ మరింత ముదిరే అవకాశం ఉన్నది. అమెరికా విధించిన కొత్తగా ప్రకటించిన సుంకాలపై చైనా సైతం ఎంత మేర సుంకాలు విధిస్తుందో చూడాల్సిందే. టారిఫ్ వార్ మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ టారిఫ్ వార్ కారణంగా ఇతర దేశాలపై సైతం భారీ ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలిన విషయం తెలిసిందే. తాజాగా సుంకాల ప్రకటనతో మార్కెట్లు ఎలా గట్టెటెక్కుతాయో వేచి చూడాల్సిందే.

# మద్యం ఆదాయం తాకట్టుతో 32 వేల కోట్ల అప్పు



తిరుపతి,గతంలో మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి 32 వేల కోట్ల అప్పులు చేశారంటూ ఏపీ ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సంచలన వ్యాఖ్యలు చేశారు.. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావేరి సమావేశ మందిరంలో ఎక్సైజ్ అధికారుల రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం జరిగింది.. ఈ సమావేంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. 2014-19 మధ్య ప్రజలకు ఇబ్బంది లేని విధంగా టీడీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ పాలసీ తీసుకొచ్చి అమలు చేశాం.. కానీ, 2019- 24 మధ్య కాలంలో ఐదేళ్లుఎ క్సైజ్ వ్యవస్థను నాశనం చేశారు. మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చి.. మద్యం వ్యాపారం మొత్తాన్ని చేతుల్లోకి తీసుకున్నారు. కొత్త పాలసీ పేరుతో వ్యవస్థ మొత్తాన్ని విచ్చిన్నం చేశారు. రాష్ట్రంలోని డిస్టిలరీల నుండి మద్యం షాపుల వరకు మొత్తాన్ని హస్తగతం చేసుకున్నారు. ఎన్ ఫోర్సు మెంట్ లేకుండా చేసి మద్యం అక్రమ వ్యాపారాలకు తెరలేపారు. మల్టీ నేషనల్ బ్రాండ్స్ మొత్తాన్ని మార్కెట్ నుంచి దూరం చేసి, తమ సొంత బ్రాండ్లను తీసుకొచ్చి ప్రజల నెత్తిన రుద్దారు అంటూ విరుచుకుపడ్డారు.. ఇక, గత ప్రభుత్వం అమలు చేసిన మద్యం విధానంతో ప్రభుత్వ ఆదాయం.. ప్రజల ఆరోగ్యం రెండూ తీవ్రంగా దెబ్బతిన్నాయని మంత్రి అన్నారు. ఏపీలో నాణ్యమైన మద్యం బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమ రవాణా పెరిగింది.. సరిహద్దు రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు పెరగగా మన రాష్ట్రంలో మద్యం ఆదాయం తీవ్రంగా కోల్పోయాం. నాసిరకం సొంత బ్రాండ్ల కారణంగా లక్షల మంది అనారోగ్యం బారిన పడగా, పలువురు కిడ్నీ, లివర్ సమస్యల బారిన పడ్డారని విమర్శించారు.. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీ ద్వారా నాసిరకం బ్రాండ్లకు స్వస్తి పలకడం జరిగింది. 6 రాష్ట్రాల్లో అమలవుతున్న మద్యం పాలసీని అధ్యయనం చేసి నూతన పాలసీకి శ్రీకారం చుట్టాం.. పాత బ్రాండ్లను తిరిగి పునరుద్ధరించాం. 350కి పైగా బ్రాండ్లు ఏపీలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు.. మద్యం ధరలను కూడా పొరుగు రాష్ట్రాలతో సమానంగా చేయడం వలన అక్రమ రవాణా ఆగింది అన్నారు కొల్లు రవీంద్ర. గతంలో ఉన్న బెల్టు షాపులపై కూడా చర్యలు తీసుకోవడంతో దాదాపు నిర్మూలించాం.. గత ఐదేళు ఎక్సైజ్ శాఖను విచ్ఛిన్నం చేసి న్ఫోర్స్మెంట్ కూడా సరిగా లేకుండా పోయింది. నవోదయం 2.0 ద్వారా సారా రహిత రాష్ట్రంగా ఏపీని మార్చేలా చర్యలు తీసుకుంటు-న్నాం అని వెల్లడించారు.. గంజాయి నిర్మూలన కోసం హోమ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేకంగా ఈగల్ టీంలను ఏర్పాటు- చేసుకున్నాం.. టూరిజం పెంపు కోసం 3స్టార్ హోటల్ కి లైసెన్స్ ఫీజు తగ్గించేలా నిర్ణయం తీసుకున్నాం.. గతంలో మద్యం ఆదాయాన్ని తాకట్టు- పెట్టి 32 వేల కోట్ల అప్పులు చేశారు.. గత ఐదేళ్ల అక్రమాల గురించి ఆ పార్టీ నేతలే బట్టబయలు చేశారు. క్యాష్ అండ్ క్యారీ.. విధానంతో దాదాపు లక్ష కోట్ల లావాదేవీలు జరగడంపై సీఐడీ విచారణ జరుగు తోందన్నారు.. కానీ కూటమి పాలనలో అన్ని షాపుల్లో డిజిటల్ పేమెంట్స్ అందుబాటు-లో ఉంచి పారదర్శకతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.. మరోవైపు ఆన్ లైన్ ఇండెంట్, ట్రాక్ అండ్ ట్రేస్ విధానంతో పారదర్శకతకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com